
# రూ.500 కోట్ల భూముల పరిరక్షణకు..!
# కలెక్టర్‌కు ఫిర్యాదు..!

- విలువైన ప్రభుత్వ భూములపై..! కన్నేసిన ల్యాండ్ మాఫియా..?
- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..

- నిజాంపేట్‌లో 14 ఎకరాల ప్రభుత్వ భూముల రక్షణకు కలెక్టర్‌కు ఫిర్యాదు..!
- సర్వే నెంబర్లు 233/22, 233/24, 233/ 25, 233/26, 233/27ల్లో ఆక్రమణలు..?
- ఆక్రమణలు, ప్లాటింగ్, నిర్మాణాలు, రిజిస్ట్రేషన్‌లపై అనుమానాలు..
- విచారణకు డిమాండ్ చేసిన ఆకుల సతీష్ టీమ్..సోమవారం ఫిర్యాదు..
- రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని సతీష్ విజ్ఞప్తి..
- జేసీబీతో పనులు వెంటనే నిలిపివేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్..
- ఆసుపత్రి, జూనియర్ కళాశాల, మినీ స్టేడియం వంటి ప్రజావసరాలకు డిమాండ్..

-4 లో



# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

## పల్లెల్లో మృగశిర కార్తె సందడి



ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల్లో సోమవారం మృగశిర కార్తె సందడి నెలకొంది. మృగశిర కార్తె ప్రవేశంతో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో, మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో చేపలను కొనుగోలు చేసేందుకు ప్రజలు పోటీపడ్డారు. లింగంపేట మండలంలోని భవాని పేట పట్నం చెరువులో చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. అందరికీ చేపలు అందే విధంగా గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చేపలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిని క్యూ లైన్లలో నిలబెట్టి చేపలను విక్రయించారు.

**అధిక ధరలకు చేపల విక్రయం..**

మృగశిర కార్తె రోజున చేపలు తినడం సంప్రదాయంగా వస్తుండటంతో మత్స్యకారులు చేపల ధరలను పెంచి విక్రయించారు. గ్యాస్‌కట్, రవట, బొచ్చ, ఆలుక రకాల తెల్ల చేపలను సాధారణ రోజుల్లో కిలోకు రూ.120 నుంచి రూ.150 వరకు విక్రయిస్తుండగా, మృగశిర కార్తె సందర్భంగా కిలోకు రూ.200 చొప్పున విక్రయించారు. అదేవిధంగా మొట్ట చేపలను సాధారణంగా కిలోకు రూ.350 చొప్పున విక్రయిస్తుండగా, మృగశిర కార్తె సందర్భంగా కిలోకు రూ.450కు విక్రయించారు. ధరలు పెరిగినప్పటికీ చేపలను కొనుగోలు చేసేందుకు ప్రజలు పోటీపడ్డారు.

హైదరాబాద్ పెన్ పవర్:



## ఆకాశాన్నంటుతున్న టమాటా ధర

**హైదరాబాద్ పెన్ పవర్:** నిత్యం వంటల్లో వాడే టమాటా ధరలు ఒక్కసారిగా భారీగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల పై పెను భారం పడుతోంది. కేవలం రెండు వారాల వ్యవధిలోనే ధరలు రెట్టింపు కావడంతో మార్కెట్‌కు వెళ్లే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. బెంగళూరుతో పాటు దాని చుట్టుపక్కల జిల్లాల్లో గత రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కూరగాయల పంటలు, ముఖ్యంగా టమాటా తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. దీంతో టమాటా ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం అక్కడ కేజీ టమాటా ధర రూ. 60 పలుకుతోంది. గుడిమల్కాపూర్ మార్కెట్‌లో రెండు వారాల క్రితం వరకు కిలో రూ. 20 నుంచి రూ. 25 పలికిన టమాటా ధర, ఇప్పుడు ఏకంగా కిలో రూ. 40 నుంచి రూ. 50 కి చేరింది. ఇక నాణ్యమైన బెంగళూరు టమాటా ధరలు అయితే ఏకంగా రూ. 80 నుంచి రూ. 100 వరకు పలుకుతుండటంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరల్లో టమాటా వేయాలంటేనే భయపడాల్సి వస్తోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరలను అదుపు చేయాలని సామాన్య ప్రజలు, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## అంబేద్కర్ ఆశయాలకు జ్ఞాన సౌధాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** సామాజిక న్యాయం, అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్, బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహ నిర్మాణాలు మైలురాళ్లుగా నిలవనున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, విద్య ద్వారానే సమాజంలో అణగారిన వర్గాలు నాయకత్వ స్థానాలకు చేరుకోగలవని ఆయన స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో ప్రతిపాదిత అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణ స్థలాన్ని, అనంతరం నింబోలీఅడ్డాలో ఆధునికీకరించనున్న బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహ స్థలాన్ని సోమవారం సంక్షేమ

- మిగతా 4లో...



- నిజాంపేట్‌లో 14 ఎకరాల ప్రభుత్వ భూముల రక్షణకు కలెక్టర్‌కు ఫిర్యాదు..!
- సర్వే నెంబర్లు 233/22, 233/24, 233/ 25, 233/26, 233/27ల్లో ఆక్రమణలు..?
- ఆక్రమణలు, ప్లాటింగ్, నిర్మాణాలు, రిజిస్ట్రేషన్లపై అనుమానాలు..
- విచారణకు డిమాండ్ చేసిన ఆకుల సతీష్ టీమ్..సోమవారం ఫిర్యాదు..
- రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని సతీష్ విజ్ఞప్తి..
- జేసీబీతో పనులు వెంటనే నిలిపివేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్..
- ఆసుపత్రి, జూనియర్ కళాశాల, మినీ స్టేడియం వంటి ప్రజావసరాలకు డిమాండ్..

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్..



# రూ.500 కోట్ల భూముల పరిరక్షణకు..!

# కలెక్టర్‌కు ఫిర్యాదు..!



మేడ్చల్ జిల్లా ప్రజావాణి ఫిర్యాదు అనంతరం, ప్రెస్‌మీట్‌లో ఆకుల సతీష్..

## విలువైన ప్రభుత్వ భూములపై..! కన్నేసిన ల్యాండ్ మాఫియా..?

## మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..

కబ్జా కోరల్లో.. నిజాంపేట్ సర్వే నెం.233లో సబ్ డివిజన్ల ప్రభుత్వ భూమి..



**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 8:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేట్ గ్రామ పరిధిలో ఉన్న సుమారు 14 ఎకరాల ప్రభుత్వ లావణి పట్టా భూములను పరిరక్షించాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించారు.. నిజాంపేట్‌లోని సర్వే నెంబర్లు 233/22, 233/24, 233/25, 233/26, 233/27లలో ఉన్న ఈ భూముల విలువ సుమారు రూ.500 కోట్లకు పైగా ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమణలు, అనధికారిక నిర్మాణాలు, అనుమానాస్పద రిజిస్ట్రేషన్లు, ప్లాటింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో ఆరోపించారు..ఈ వ్యవహారంలో కొందరు రాజకీయ నాయకులు, ప్రైవేట్ వ్యక్తులు, సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. హైకోర్టులోని డబ్ల్యు.పి నెంబర్:13469/2011 కేసులో రెవెన్యూ అధికారులు సమర్పించిన వివరాలను ప్రస్తావిస్తూ, ప్రొసీడింగ్స్ నెం. ఎ/1741/2008, తేదీ 10-03-2010 ప్రకారం సర్వే నంబర్లు 233/24, 233/25, 233/26లలోని సుమారు 12 ఎకరాల భూమిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.. అదేవిధంగా, 2026 ఏప్రిల్ 6న తహసీల్దార్ కార్యాలయం జిల్లా యంత్రాంగానికి పంపిన నివేదికలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు అవసరమని సూచించిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు..

### రిజిస్ట్రేషన్‌ల చట్టబద్ధతపై విచారణ జరపాలి..

జీవో యం.ఎస్ నెంబర్:166-2020కు సంబంధించిన అంశాలు, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాలు, భూముల స్థితిగతులపై నెలకొన్న న్యాయపరమైన వివాదాలను కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు.. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి డాక్యుమెంట్ నెం.16562/2025 ద్వారా జరిగినట్లు పేర్కొంటున్న రిజిస్ట్రేషన్ల చట్టబద్ధతపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న జేసీబీ పనులు, భూ సమీకరణ, ప్లాటింగ్, నిర్మాణ కార్యకలాపాలను వెంటనే నిలిపివేసి భూముల హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.. ప్రభుత్వానికి చెందిన ఈ కోట్లు విలువైన భూములను భవిష్యత్తులో ప్రభుత్వ ఆసుపత్రి, జూనియర్ కళాశాల, మినీ స్టేడియం, పార్కు లేదా ఇతర ప్రజా అవసరాల కోసం పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో అప్పీలు, రివ్యూ పిటిషన్లు దాఖలు చేసి ప్రభుత్వ హక్కులను కాపాడాలని కోరారు.. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని ఫిర్యాదుదారులో విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో పి.బి. శ్రీనివాస్, ఎల్ల స్వామి, పాండు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# అంబేద్కర్ ఆశయాలకు జ్ఞాన సౌధాలు

- 3 పేజి తరువాయి

శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ కేవలం ఇటుకలు, సిమెంట్‌తో నిర్మించే భవనం కాదని, కోట్లాది మంది దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల యువత భవిష్యత్తును తీర్చిదిద్దే విజ్ఞాన సౌధమని పేర్కొన్నారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల్లో నిర్మించనున్న ఈ టవర్‌లో డిజిటల్ లైబ్రరీలు, ఈ-లెర్నింగ్ సెంటర్లు, పరిశోధన విభాగాలు, పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాలు, కాన్ఫరెన్స్ హాళ్లు, కెరీర్ గైడెన్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా నగర విద్యార్థులతో సమానంగా అవకాశాలు పొందేలా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి, హైదరాబాద్‌లోని నిష్ణాతులైన అధ్యాపకుల బోధనను ప్రత్యక్షంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందించనున్నట్లు వెల్లడించారు. సివిల్స్, గ్రూప్స్, బ్యాంకింగ్, రైల్వేలు, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసరమైన అత్యుత్తమ శిక్షణను పేద విద్యార్థులకు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్య కోసం హైదరాబాద్‌కు రాలేని విద్యార్థులకు వారి ప్రాంతాల నుంచే ఉన్నత అవకాశాలను అందించే వ్యవస్థను ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. నింబోలీ అడ్డాలోని చారిత్రాత్మక విద్యార్థి వసతి గృహాన్ని ప్రస్తావిస్తూ, ఇది కేవలం ఒక హాస్టల్ కాదని, వేలాది మంది పేద విద్యార్థుల కలలకు ఆశ్రయం కల్పించిన సామాజిక చరిత్రకు సజీవ సాక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇక్కడ నివసించిన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలుగా ఎదిగి సమాజానికి సేవలందించారని గుర్తు చేశారు.ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని ఖర్చుగా కాకుండా సామాజిక పెట్టుబడిగా చూస్తోందని, సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల సమర్థ వినియోగం, హాస్టళ్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులు, విద్యా మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుతోందన్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో సుమారు రూ. 110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, నిమ్బోలి అడ్డాలో సుమారు రూ. 25 కోట్లతో అత్యాధునిక వసతులతో బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా నా హయాంలో ఈ రెండు చారిత్రాత్మక ప్రాజెక్టులకు నిధులు కేటాయించి కార్యరూపం దాల్చడం జీవితంలో గర్వకారణమైన ఘట్టం అని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ టవర్ ద్వారా ప్రతి సంవత్సరం వేలాది మంది యువతకు సివిల్స్, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, పోలీస్, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందించడంతో పాటు డిజిటల్ లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కెరీర్ కౌన్సెలింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఆర్ అండ్ బి సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ నర్సింగరావు, ఈఈ మనోహర్, ఆర్డీవో సాయిరాం, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.


# సివిల్ డ్రెస్సులో వెళ్లి హైదరాబాద్ పబ్ గుట్టురట్టు చేసిన మహిళా డీసీపీ!

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలోని ఒక ప్రముఖ పబ్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో ఓ సీనియర్ ఐపీఎస్ అధికారిణి నేరుగా రంగంలోకి దిగారు. సివిల్ డ్రెస్సులో వెళ్లి ఆకస్మిక దాడి నిర్వహించి, అక్కడ గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార దందాతో పాటు పలు అక్రమాలను బట్టబయలు చేశారు. ఈ ఘటన కూకట్‌పల్లి ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కూకట్‌పల్లి డీసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి రితి రాజ్, స్థానిక 'కింగ్స్ అండ్ క్వీన్స్' (క్లబ్ మస్తీ) పబ్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. పబ్‌లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో, ఆమె మొదట స్వయంగా మారువేషంలో వెళ్లి అక్కడి పరిస్థితులను నిర్ధారించుకున్నారు. అనంతరం పోలీసు బృందంతో కలిసి మెరుపు దాడి చేశారు.

వివిధ మీడియా కథనాల ప్రకారం, కస్టమర్లను ఆకర్షించడం కోసం పబ్ యాజమాన్యం యువతులను పావులుగా వాడుకుంటూ వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. యువకులతో సదరు మహిళలు పరిచయాలు పెంచుకుని, వారితో చాటింగ్ చేస్తూ పబ్ కు రప్పించడం ఈ ప్లాన్ లో భాగం. వారి ద్వారా కస్టమర్ల నుంచి భారీగా బిల్లులు వసూలు చేస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులు సహా మొత్తం తొమ్మిది మంది పబ్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ తనిఖీల్లో మరిన్ని నిబంధనలు ఉల్లంఘనలు కూడా వెలుగుచూశాయి. పబ్‌లోకి మైనర్లను అనుమతించడం, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా మద్యం, ఆహారం సరఫరా చేయడం, పోలీసుల నుంచి అవసరమైన నిరభ్యంతర పత్రం లేకపోవడం వంటి అక్రమాలను గుర్తించారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పీటా చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సదరు పబ్‌పై 2025లో కూడా గతంలో పలు కేసులు నమోదైనట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి.






## నిలోఫర్ లో వైద్యులు నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:** నిలోఫర్ ఆస్పత్రిలో పీజీ వైద్యుడిపై రోగి సహాయకుడి దాడి చేయడాన్ని నిరసిస్తూ, పీజీ వైద్యులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. మూడు రోజులక్రితం డాక్టర్స్ పై దాడి జరిగినా అధికారులు, పోలీసులు పట్టించుకోలేదని వారన్నారు. పిజి విద్య విద్యార్థులపై రోగి సహాయకులు దాడి చేయడాని నిరసిస్తూ...దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలికను ఆసుపత్రికి తీసుకొచ్చారు. వచ్చిన మొదటి రోజునుండి బాలిక తాలూకు కుటుంబసభ్యులు ఐసీయూలో పదుల సంఖ్యలో వచ్చి తీవ్ర ఇబ్బందులు పెట్టారు. శని వారం అర్ధరాత్రి రోగి సహాయకుడు ఐసీయూలోకి వచ్చి వాగ్వాదం చేసి డాక్టర్ పై రోగి సహాయకుడు దాడికి దిగారు. వెంటనే స్పీఎఫ్ పోలీసులకు పిర్యాదు చేసారని అన్నారు.

ఎస్పిఎఫ్ పోలీసులు డాక్టర్స్ కు కాకుండా దాడికి పాల్పడిన వారికే మద్దత్తు పలకడానికి పిజి వైద్యులు తీవ్రంగా ఖండించారు నాంపల్లి పోలీసులకు పిర్యాదు చేసిన ...అప్పటికి పోలీసులు పట్టించుకోకపోవడం తో పిజి వైద్యులు వీధులు బహిష్కరించి ఆందోళ చేపట్టారు.

## బోల్లారం లో చైన్ స్నాచింగ్

**మేడ్చల్: పెన్ పవర్:** బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో తెల్లవారుజామున చోరీ కలకలం రేపింది. చింతల బజార్ గంగపుత్ర సంఘం వెనుక కాలనీలో ఘటన జరిగింది. ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న మహిళపై దుండగుడి దాడి జరిగింది. ముఖంపై మత్తు పౌడర్ చల్లి బంగారు పుస్తెలతాడు అపహరణ జరిగింది. బాధితురాలు రాంప్రసాద్ భార్య.. సుమారు 7 తులాల బంగారం చోరీ అయింది. సమాచారం అందుకున్న వెంటనే బొల్లారం పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## తమను దూషించిన వారు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి...

**హైదరాబాద్ పెన్ పవర్:** తమను దూషించిన సెంట్రింగ్ కార్మిక సంఘాల పై చర్యలు తీసుకోవాలంటూ మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఆగ్రహం వ్యక్తమైంది. పోచారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో కార్మికులు సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. నిర్మాణ రంగంలో రక్తాన్ని చెమటగా మార్చే కార్మికులను దళారీలు, మోసగాళ్లు అంటూ సెంట్రింగ్ కార్మిక సంఘాలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై కార్మిక లోకం భగ్గుమంది. భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించేది లేదని మేస్త్రీల సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు. ఘట్కేసర్ సర్కిల్, 8వ డివిజన్ పోచారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో సోమవారం ఉదయం నుంచే వాతావరణం వేడెక్కింది. తమను దుర్భాషలాడిన సెంట్రింగ్ సంఘాల వారికి వ్యతిరేకంగా కార్మికులు రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప కాలనీ భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సంఘం అధ్యక్షుడు తిరుమలయ్య మాట్లాడుతూ... రాత్రింబవళ్లు కష్టపడి భవనాలు నిర్మించే కార్మికులను కొందరు నోటికొచ్చినట్లు దూషించడం దారుణమన్నారు. ఈ నిరసన కేవలం కాలనీకే పరిమితం కాదని, రాష్ట్ర రాజధాని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మహా ధర్నాకు మద్దతుగా ఈ ర్యాలీ చేపట్టామని నేతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మేస్త్రీల సంఘం పెద్దలు, కార్మిక సంఘాల నేతల సూచనల ప్రకారం... న్యాయం జరిగే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, అవసరమైతే నిర్మాణ పనులన్నింటినీ బంద్ చేసి నిరసనను ఉధృతం చేస్తామని కార్మిక నేతలు ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అవునా నిర్మాణ కార్మికుల మేస్త్రి సంఘం ఉపాధ్యక్షుడు కీల భాస్కర్, ప్రధాన కార్యదర్శి మద్దూరి శ్రీను, కోశాధికారి ఈ. ఉపేందర్, ప్రచార కార్యదర్శి ఎం. శేఖర్ మరియు కమిటీ సలహాదారులు ఎస్.కె. ఆలీ భాయ్, సైదులు, డి.వి. కృష్ణ మరియు భవన నిర్మాణ కార్మికులు మేస్త్రిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్ పెన్ పవర్:** లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించగా, అందులో తొలి విడతగా రూ.50 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. సోమవారం అంబేద్కర్ భవన్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల్లో నిర్మించనున్న ఈ నాలెడ్జ్ సెంటర్ నిరుపేద విద్యార్థులకు ఉన్నత స్థాయి శిక్షణ అందించే కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని భట్టి తెలిపారు. ఇందులో శిక్షణ తరగతులు, ఆధునిక డిజిటల్ లైబ్రరీ, వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులతో సెమినార్లు, చర్చా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని పంచుతామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యా, ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ కేంద్రాలు దోహదపడతాయని అన్నారు. అదే విధంగా, నింబోలి అడ్డలోని ఎస్సీ హాస్టల్‌ను ఆధునికీకరిస్తున్నామని, దానికి “బాబు జగ్జీవన్ రామ్ భవన్”గా నామకరణం చేయనున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శంకర విద్యాలయ స్కూల్ తొలగించాలి.

**హైదరాబాద్ పెన్ పవర్:** శక్తి సాయి నగర్ లో శంకర విద్యాలయ స్కూల్ ఏ యూనిట్ ఆఫ్ శాండిల్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కూల్ ను తక్షణమే కాలనీ నుంచి తొలగించాలని శక్తి సాయి నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం శంకర విద్యాలయ స్కూల్ ఎదుట కాలనీవాసులు పెద్ద ఎత్తున చేరి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి స్కూలు ఇక్కడ ఏర్పాటు చేయొద్దని పోరాటాలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ క్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి డీఈఓ, మండల అధికారి ఎంఈఓ కు సైతం ఫిర్యాదులు చేసినట్లు వివరించారు. తాము ఎన్ని ఫిర్యాదు చేసినా కూడా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. స్కూల్ ని ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల కాలనీవాసులకు పెద్ద ఎత్తున ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. కాలనీలో రెసిడెన్షియల్ అనుమతి తీసుకొని నిర్మించిన భవనంలో కమర్షియల్ గా స్కూల్ ఏర్పాటు చేయడం కూడా చట్ట విరుద్ధమని దీనిపైన కూడా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్కూలును కాలనీ నుంచి తీసివేయాలని లేనియెడల పెద్ద ఎత్తున కాలనీవాసులు అందరం నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో 2 రోజులపాటు నేటి నుంచి చేప ప్రసాదం పంపిణీ

**హైదరాబాద్ జూన్ 8, పెన్ పవర్:**
మృగశిర కార్తెను పురస్కరించుకుని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సోమవారం రాత్రి 9 గంటల నుంచి ప్రారంభం కానున్న 'చేప ప్రసాదం' పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం కూడా ఈ పంపిణీ కొనసాగనుంది. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భక్తుల రద్దీ నియంత్రణకు అధికారులు కట్టుదిట్టమైన భద్రతతో పాటు 35 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా షెడ్లలోనే పంపిణీ జరగనుంది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 1.4 లక్షల చేప పిల్లలను సిద్ధం చేయగా, చిన్న చేపను రూ.40, పెద్ద చేపను రూ.50 చొప్పున విక్రయించనున్నారు. దాదాపు 1.5 లక్షల మందికి సరిపడా 5 క్వింటాళ్ల ప్రసాదాన్ని బత్తిని కుటుంబం తయారు చేసింది. ఉబ్బస నివారణ కోసం గత 180 ఏళ్లుగా బత్తిని కుటుంబం అందిస్తున్న ఈ చేప మందు, కాలక్రమేణా 'చేప ప్రసాదం'గా ప్రసిద్ధి చెందింది. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'చేప ప్రసాదం' పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్‌లు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారని... దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 25 వేల మంది ఇప్పటికే నగరానికి చేరుకున్నారని ఆయన తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని... ఈ భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్రమోహన్ పర్యవేక్షిస్తారని వెల్లడించారు. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని, అత్యవసర వైద్య సేవల కోసం ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వివిధ భాషల్లో భక్తులకు సూచనలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అందరికీ సరిపడా ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సీపీ స్పష్టం చేశారు. స్థానికులు రద్దీని బట్టి రేపైనా వచ్చి ప్రసాదం తీసుకోవచ్చని సూచించారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం నిఘా ఉంచుతారని చెప్పారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వాళ్లు రాత్రి వేళల్లో పోలీసులకు సహకరించాలని కోరారు.

## వీబీ జీ రామ్‌జీ చట్టంతో జరిగే నష్టాన్ని భర్తి చేసే విధంగా చర్యలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్ పెన్ పవర్:** జులై 1 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీజీ-రామ్‌జీ చట్టం అమలులోకి వచ్చే నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహం, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలపై విస్తృతంగా సమాలోచనలు ప్రారంభించింది. ఈ మేరకు సోమవారం సచివాలయంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ పేదల ఉపాధి, జీవనోపాధి ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణలో లక్షలాది గ్రామీణ కుటుంబాలకు ఉపాధి హామీ పథకం జీవనాధారంగా మారిందని, కార్మికుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నీ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించబోదని స్పష్టం చేశారు. కర్ణాటక, కేరళ, జార్ఖండ్ రాష్ట్రాలు వీబీజీ రామ్‌జీ చట్టంపై అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ఉపాధి హక్కు, రాష్ట్రాల ఆర్థిక భారం, సమాఖ్య స్ఫూర్తికి సంబంధించిన అంశాలపై ఆయా రాష్ట్రాల అభిప్రాయాలు, చర్యలను పరిశీలించాలని ఆదేశించారు.

**గ్రామీణ కుటుంబాలు నష్టపోకుండా చర్యలు:**
గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఉపాధి హక్కును కాపాడటం మా కర్తవ్యం. కొత్త చట్టం అమలుతో తెలంగాణ కార్మికులు, రైతులు, గ్రామీణ కుటుంబాలు నష్టపోకుండా ఉండేలా అన్ని కోణాల్లో అధ్యయనం చేస్తున్నాం. కొత్త చట్టంతో జరిగే నష్టాన్ని భర్తి చేసే విధంగా చర్యలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈవీబీజీ రామ్‌జీ చట్టంలోని ప్రధాన నిబంధనలు, వాటి ప్రభావం, రాష్ట్ర ప్రభుత్వంపై పడే అదనపు ఆర్థిక భారం, గ్రామీణ ఉపాధిపై ప్రభావం తదితర అంశాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు.

**తెలంగాణపై ప్రభావం:**
ప్రస్తుతం అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పోలిస్తే, కొత్త చట్టంలో వ్యవసాయ సీజన్‌లలో 60 రోజుల పాటు ఉపాధి పనులకు విరామం ఇవ్వాల్సి ఉండటం, రాష్ట్రాలకు ముందుగా నిర్ణయించిన నిర్ణీత నిధుల కేటాయింపు విధానం అమలు చేయడం, కేంద్ర రాష్ట్ర వ్యయ భాగస్వామ్యాన్ని 60:40 నిష్పత్తికి మార్చడం వంటి అంశాలు తెలంగాణపై ప్రభావం చూపే అవకాశం ఉందని సమావేశంలో చర్చించారు. గ్రామీణ కార్మికులకు డిమాండ్ మేరకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించే విధానాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న ప్రత్యామ్నాయాలను కూడా అధికారులు వివరించారు. అవసరమైతే రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావడం, కేంద్రం నిర్ణయించే నార్మేటివ్ కేటాయింపులకు మించి అవసరమయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించే అవకాశాలు, కేంద్ర రాష్ట్ర నిధుల భాగస్వామ్య విధానంలో మార్పులు కోరడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి.

## అంబేద్కర్ ఆశయాలకు జ్ఞాన సౌధాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** సామాజిక న్యాయం, అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్, బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహ నిర్మాణాలు మైలురాళ్లుగా నిలవనున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, విద్య ద్వారానే సమాజంలో అణగారిన వర్గాలు నాయకత్వ స్థానాలకు చేరుకోగలవని ఆయన స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో ప్రతిపాదిత అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణ స్థలాన్ని, అనంతరం నింబోలీఅడ్డాలో ఆధునికీకరించనున్న బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహ స్థలాన్ని సోమవారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ కేవలం ఇటుకలు, సిమెంట్‌తో నిర్మించే భవనం కాదని, కోట్లాది మంది దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల యువత భవిష్యత్తును తీర్చిదిద్దే విజ్ఞాన సౌధమని పేర్కొన్నారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల్లో నిర్మించనున్న ఈ టవర్‌లో డిజిటల్ లైబ్రరీలు, ఈ-లెర్నింగ్ సెంటర్లు, పరిశోధన విభాగాలు, పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాలు, కాన్ఫరెన్స్ హాళ్లు, కెరీర్ గైడెన్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా నగర విద్యార్థులతో సమానంగా అవకాశాలు పొందేలా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి, హైదరాబాద్‌లోని నిష్ణాతులైన అధ్యాపకుల బోధనను ప్రత్యక్షంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందించనున్నట్లు వెల్లడించారు. సివిల్స్, గ్రూప్స్, బ్యాంకింగ్, రైల్వేలు, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసరమైన అత్యుత్తమ శిక్షణను పేద విద్యార్థులకు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్య కోసం హైదరాబాద్‌కు రాలేని విద్యార్థులకు వారి ప్రాంతాల నుంచే ఉన్నత అవకాశాలను అందించే వ్యవస్థను ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. నింబోలీ అడ్డాలోని చారిత్రాత్మక విద్యార్థి వసతి గృహాన్ని ప్రస్తావిస్తూ, ఇది కేవలం ఒక హాస్టల్ కాదని, వేలాది మంది పేద విద్యార్థుల కలలకు ఆశ్రయం కల్పించిన సామాజిక చరిత్రకు సజీవ సాక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇక్కడ నివసించిన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలుగా ఎదిగి సమాజానికి సేవలందించారని గుర్తు చేశారు.

ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని ఖర్చుగా కాకుండా సామాజిక పెట్టుబడిగా చూస్తోందని, సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల సమర్థ వినియోగం, హాస్టళ్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులు, విద్యా మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుతోందన్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో సుమారు రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, నిమ్బోలి అడ్డాలో సుమారు రూ.25 కోట్లతో అత్యాధునిక వసతులతో బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా నా హయాంలో ఈ రెండు చారిత్రాత్మక ప్రాజెక్టులకు నిధులు కేటాయించి కార్యరూపం దాల్చడం జీవితంలో గర్వకారణమైన ఘట్టం అని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ టవర్ ద్వారా ప్రతి సంవత్సరం వేలాది మంది యువతకు సివిల్స్, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, పోలీస్, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందించడంతో పాటు డిజిటల్ లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కెరీర్ కౌన్సెలింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెలల్సీ అద్దంకి దయాకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఆర్ అండ్ బి సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ నర్సింగరావు, ఈఈ మనోహర్, ఆర్డీవో సాయిరాం, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముషీరాబాద్ లో పెద్ద ఎత్తున చేపల అమ్మకాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మృగశిర కార్తె సందర్భంగా నగరంలోని అతిపెద్దదైన ముషీరాబాద్ చేపల మార్కెట్లో పెద్ద ఎత్తున చేపల అమ్మకాలు కొనసాగాయి. స్థానికులతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, చిరు వ్యాపారులు పెద్ద ఎత్తున మార్కెట్కు తరలివచ్చి చేపలు కొనుగోలు చేశారు .దీంతో మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము రెండు గంటల నుంచి వ్యాపారాన్ని ప్రారంభించారు. మృగశిర కార్తె సోమవారం రావడం వల్ల అమ్మకాలు కొంత తగ్గాయని స్థానిక గంగపుత్ర సంఘం నాయకుడు జీ. ప్రసాద్ తెలిపారు. కొనుగోలుదారులు మోసపోకుండా తూనికల కొలతల శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులపై కేసులు నమోదు చేశారుపోలీసులు

## నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**హైదరాబాద్ పెన్ పవర్:**
సిపిఎం ఆధ్వర్యంలో రెండు రోజుల యువజన సమ్మేళనం జరగనుంది. ఈ నెల 16, 17 తేదీల్లో కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ హాలులో యువజన సమ్మేళనం జరగనుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు.

కక్రోజ్ పార్టీ పేరుతో యూత్ నిరసన వ్యక్తం చేస్తుంది. ఈ సమ్మేళనంలో యువజన సమస్యలపై చర్చించడంతోపాటు భవిష్యత్తు కార్యచరణ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్ పై దృష్టి పెట్టటడంలేదు. ప్రభుత్వం రంగంలో 60లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. రైల్వేస్ లో 10లక్షల ఖాళీలు ఉన్నాయి. రాజీవ్ యువ వికాసం ప్రకటించి దానికి నిధులు కేటాయించటం లేదు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఎస్సీ ఎస్టీసంక్షేమం నిర్వీర్యం అయ్యాయని ఆయన ఆరోపించారు..

# మరో వర్కింగ్ ప్రెసిడెంట్ గా బీసీ నేత

**కరీంనగర్, జూన్ 8, పెన్ పవర్:** వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది బీఆర్ఎస్ అధిష్టానం. అందులో భాగంగా సభ్యత్వ నమోదును ప్రయారిటీలో తీసుకుని ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయి ఇన్చార్జ్‌లను నియమించారు. ఆపని పూర్తవగానే.... గ్రామ, మండల, జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నారు. ఈసారి ఆ కార్యవర్గమే సంచలనం అయ్యే అవకాశం ఉందని చెప్పుకుంటున్నాయి గులాబీ వర్గాలు. వెనుకబడిన తరగతులకు ప్రతినిధిగా పార్టీలో ఓ పెద్ద పోస్ట్ క్రియేట్ చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ ఉన్నారు. పార్టీ వ్యవహారాలన్నీ ఈ రెండు పదవుల చుట్టూనే తిరుగుతుంటాయని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. అయితే... ఇక్కడే కొత్త ఆలోచన చేస్తోందట అధిష్టానం. కుటుంబ ముద్ర నుంచి బయటపడటంతో పాటు సామాజిక సమీకరణల్ని గట్టిగా పాటిస్తున్నామని చెప్పే క్రమంలో...కేటీఆర్‌కు సమాంతరంగా మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌ని సృష్టించాలనుకుంటున్నట్టు సమాచారం. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగే సెప్టెంబర్, అక్టోబర్‌లోనే ఈ కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకాన్ని కూడా చేపట్టాలనుకుంటున్నట్టు తెలుస్తోంది.ఆ పోస్ట్‌లో ఒక బీసీ నేతను నియమించాలనుకుంటున్నారన్నది బీఆర్ఎస్ ఇంటర్నల్ టాక్. కొత్తగా మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఏర్పాటు చేయడానికి చాలా కారణాలు ఉన్నాయని అంటున్నారు పార్టీ నేతలు. ప్రస్తుతం దేశంతో పాటు రాష్ట్రంలో కూడా బీసీ ఉద్యమం వాయిస్ పెరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసిందని బీఆర్ఎస్ పదేపదే చెబుతోంది. ఈ సమయంలో బీసీలకు న్యాయం చేసేది తామేనని చెప్పుకునే క్రమంలో కేటీఆర్ స్థాయికి సమానంగా ఉండే మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ సృష్టించి దాన్ని బీసీ నేతలు ఇవ్వాలని భావిస్తున్నారట. అలా.... బీసీ నేతకు పార్టీలో కేటీఆర్‌తో సమాన స్థాయి ఇవ్వడం ద్వారా బలహీనవర్గాలకు ప్రాధాన్యం, కుటుంబ ముద్ర చెరిపేసుకోవడం లాంటి బహుళ లక్ష్యాలను సాధించాలనుకుంటున్నట్టు సమాచారం. ఆ కొత్త పదవికి ఎవర్ని ఎంపిక చేయాలనే దానిపై కూడా కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్టు చెబుతున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లకు, హైదరాబాద్ మహబూబ్ నగర్ రంగారెడ్డి జిల్లాల పట్టభద్రుల స్థానానికి త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. కాబట్టి ఆ జిల్లాలకు సంబంధించిన నేతను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటిస్తారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ముందు వరసలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఉన్నట్టుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుతం తలసాని గ్రేటర్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలోనే సమావేశాలు జరుగుతున్నాయి. వచ్చే గ్రేటర్ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయనకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారన్న అంచనాలు ఎక్కువగానే ఉన్నాయి. మరోవైపు తలసానితో పాటు మరికొంత మంది బీసీ నేతల పేర్లు కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి రేస్‌లో వినిపిస్తున్నాయి. మహబూబ్ నగర్ జిల్లా నుంచి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేరు కూడా పరిశీలనలో ఉందట. ఉత్తర తెలంగాణలో కీలక నేతగా ఉన్న మరో మాజీ మంత్రి గంగుల కమలాకర్ పేరు కూడా బీసీ కోటాలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే... పార్టీలో సీనియర్ నేత అయిన మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనా చారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయట. దీంతో... ఫైనల్‌గా కొత్త పదవి ఎవర్ని వరిస్తుందోనని ఆసక్తిగా చూస్తున్నాయి గులాబీ వర్గాలు.

# సేమ్ సెంటర్... సేమ్ ప్లేస్... ఎటాక్ మోడ్ లో గులాబీ దళం

**వరంగల్, జూన్ 8, పెన్ పవర్:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ప్లాన్ చేస్తోంది బీఆర్ఎస్. ఆ ఊపులోనే.... అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేందుకు పావులు కదుపుతోంది. అందుకోసం ఎన్నికల ప్రచారంలో హస్తం నేతలు ఇచ్చిన హామీలు, గ్యారంటీలనే అస్త్రాలుగా వాడాలనుకుంటోందట. అసెంబ్లీ ఎలక్షన్స్‌కు ముందు కాంగ్రెస్ నేతలు రకరకాల డిక్లరేషన్స్ ప్రకటించగా. ఇప్పుడు వాటి అమలు కోసం వత్తిడి చేయడంతో పాటు చేయకుంటే ప్రజల్లోకి వెళ్ళి ఉద్యమ రూపం తీసుకువచ్చేందుకు ప్లానింగ్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే డిక్లరేషన్స్ ప్రకటించిందో ఇప్పుడు అదే ప్రాంతాలకు అక్కడి నుంచే సమరానికి సై అంటోంది గులాబీ దళం. రెండు నెలల క్రితం వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభను అలాగే నిర్వహించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అక్కడే రైతు డిక్లరేషన్‌ను ప్రకటించింది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు, సీనియర్ నేతలందరూ హాజరైన ఈ సమావేశం బాగా సక్సెస్ అయిందనట్టు బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే అదే ఊపుతో నెలకో సభ పెట్టి...దూకుడుగా ముందుకు వెళ్ళాలని అనుకున్నా... ఆ పని జరగలేదు. ఊపు వచ్చాక ఒక్కసారిగా పార్టీ పెద్దలు ఎందుకు ఆగారో అర్ధంగాక కింది స్థాయిలో బుర్ర గోక్కుంటున్నారు. రైతుల తర్వాత వెంటనే కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ మీద పోరాటం చేయాలని భావించింది బీఆర్ఎస్. ఈ నెలలో ఆ సభ నిర్వహిస్తారని మొదట చెప్పినా.... ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. అలా ఎందుకంటే... ప్లానింగ్ మారింది, డిఫరెంట్‌గా ఉండబోతోందన్నది పార్టీ వర్గాల ఆన్సర్. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయడానికి తమ దగ్గర ఉన్న ప్రధాన ఆయుధం వారిచ్చిన హామీలు, గ్యారంటీలే అన్నది బీఆర్ఎస్ భావన. వాటిని అమలు చేయలేదని నిరూపించడమే తమకు ప్రధానం అంటున్నారు గులాబీ సీనియర్స్. అలాంటి ఆయుధాన్ని వెంట వెంటనే వాడేస్తే... ఎన్నికల నాటికి వాడకం



కోసం ఏమీ మిగలవని, అధికార కాంగ్రెస్‌పై పోరాటానికి వీటిని పద్ధతిగా వాడాలని డిసైడయ్యారట.మొత్తాన్ని ఒకేసారి ఉపయోగించకుండా... మెల్లిగా, టైం చూసి ఒక్కొక్క అస్త్రాన్ని బయటికి తీసి ప్రభుత్వం మీద ప్రయోగించాలనుకుంటున్నట్టు సమాచారం.యూత్ డిక్లరేషన్‌పై పోరాటాన్ని వాయిదా వేసుకున్నట్టు తెలుస్తోంది. ఒక డిక్లరేషన్‌పై పోరాట సభకు, మరో దానికి మధ్య కనీసం ఆరు నెలల గ్యాప్ ఉంటే బాగుంటుందని పార్టీ పెద్దలు భావిస్తున్నారట. అందుకోసమే రైతు డిక్లరేషన్ పై పోరాటం సక్సెస్ అయిన ఈ సమయంలో వచ్చే ఐదారు నెలలు దాని గురించే మాట్లాడుకునేలా చేసి అదే అంశాన్ని జనాల్లోకి తీసుకెళ్లాలని.. తర్వాత యూత్ డిక్లరేషన్, దాని తర్వాత బీసీ డిక్లరేషన్ లాంటి అంశాలను తీసుకోవాలనుకుంటున్నట్టు సమాచారం. ముందు ఒక కార్యక్రమం చేసి... ఆ హీట్ తగ్గకుండా జాగ్రత్తపడుతూ... అది కాస్త తగ్గుతుందనుకున్నప్పుడు మరో అస్త్రాన్ని బయటికి తీసి ఆ టెంపోని అలాగే మెయిన్‌టెయిన్ చేయాలనుకుంటున్నట్టు సమాచారం. ప్రతిపక్ష పార్టీగా.... ప్రభుత్వం మీద పోరాటానికి కలిసి వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోకూడదన్నది బీఆర్ఎస్ భావన. ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నందున ఆరు నెలలకో పెద్ద బహిరంగ సభ పెట్టి డిక్లరేషన్స్ మీద పోరాటాలకు సిద్ధమవుతోంది కారు పార్టీ. దాన్ని అలా కొనసాగిస్తే... ఎన్నికల నాటికి బాగా ఉపయోగపడుతుందని లెక్కేలేస్తున్నారు.

# గ్రేటర్ లో టీడీపీ పోటీ...



**హైదరాబాద్, జూన్ 8, పెన్ పవర్:** ఎన్నికల్లో టిడిపి పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీజేపీని ఉద్దేశించి టిడిపి అక్కడ యాక్టివ్ అయ్యేందుకు అన్ని సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం. తెలంగాణలో తెలుగుదేశం పార్టీలో పని చేసిన నేతలంతా ఇప్పుడు చంద్రబాబుకు టచ్ లోకి వస్తున్నట్లు సమాచారం. పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తమ ప్రతిపాదనను చంద్రబాబు ఎదుట పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలోనే తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టారట చంద్రబాబు. ప్రస్తుతం అక్కడ పార్టీకి నాయకత్వం లేదు కానీ.. క్యాడర్ ఇప్పటికీ కొనసాగుతోంది. టిడిపి అభిమానులు కూడా ఎక్కువే. గ్రేటర్ తో పాటు సెటిలర్స్ ఉన్న జిల్లాలు చాలా ఉన్నాయి. అటువంటి చోట్ల మాత్రం టిడిపి పేరు ప్రముఖంగా వినిపిస్తూనే ఉంటుంది.మొన్న తెలంగాణలో పర్యటనకు వచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పదివేల కోట్ల రూపాయల నిర్మాణాలకు సంబంధించి హైదరాబాదులో శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. చంద్రబాబుతో అయితే గంటల తరబడి చర్చించారు. అయితే దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. ఏపీలో ఎన్డీఏ కూటమి నడుస్తోంది మూడు పార్టీలతో. తెలంగాణలో సైతం మూడు పార్టీలు ఏకతాటి పైకి వస్తే బాగుంటుంది అనే అభిప్రాయం ఉంది. అయితే గతంలో మాదిరిగా ప్రత్యేక రాష్ట్ర భావన లేదు. ఇప్పుడు అంతా అభివృద్ధి అజెండాగా సాగుతోంది తెలంగాణ రాజకీయం. తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేసేందుకు ఇదే సరైన సమయం అని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర పెద్దల ఆదేశాలతో గ్రేటర్ ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య పొత్తు

ఉండబోతుందనేది ఒక అంచనాతెలుగుదేశం పార్టీకి తెలంగాణలో బలమైన కేడర్ ఉంది. ఎందుకంటే ఆ పార్టీ పుట్టింది తెలంగాణలో. ఎన్టీఆర్ బలమైన పునాదులు ఏర్పాటు చేశారు. అవి తెలంగాణలో ఎక్కువగా నాటుకున్నాయి కూడా. మధ్యలో ప్రత్యేక రాష్ట్రం వాదంతో తెలుగుదేశం కాస్త ఇబ్బంది పడింది. ప్రతి దానికి చంద్రబాబు బూచి ని చూపించి రాజకీయం చేశారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పుష్కరకాలం దాటుతున్న క్రమంలో క్రమేపి ప్రాంతీయ వాదం బలహీనపడుతోంది. అభివృద్ధి మంత్రం పతాక స్థాయికి చేరుకుంటుంది. అందుకే ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కలిసి నడుస్తాయన్న ప్రచారం జరుగుతోంది.తెలంగాణలో ప్రస్తుతం అన్ని పార్టీల్లో ఉన్న నాయకులు ఎక్కువగా టిడిపి నుంచి వెళ్లిన వారి. గులాబీ పార్టీలో అయితే ఆ పార్టీ బాస్ కెసిఆర్ నుంచి దిగువ స్థాయి కేడర్ వరకు అంతా టిడిపి దే. కాంగ్రెస్ పార్టీలో కూడా మెజారిటీ నాయకత్వం టిడిపి నుంచి వెళ్ళింది. అయితే ఇప్పుడు గులాబీ పార్టీ పరిస్థితి బాగా లేకపోవడంతో.. ఆ పార్టీలో ఉన్న పూర్వపు టిడిపి నేతలు అంతా పూర్వాశ్రమం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారట. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధమవుతున్నారట. ఇప్పటికే చంద్రబాబుకు చాలామంది టచ్లోకి వచ్చారట. సరైన సమయం చూసి చెబుతానని బాబు చెప్పారట. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజం ఎంత ఉందో

# అన్నదాతలకు ముఖ్యమంత్రి రేవంత్ శుభాకాంక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** వానాకాలం వ్యవసాయానికి శ్రీకారం చుట్టే మృగశిర కార్తె ప్రారంభమవుతున్న ఈ శుభ సందర్భంలో అన్నదాతలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయం పండుగగా, తొలకరి పలకరింపు రైతులు, రైతు కూలీల ఇళ్లల్లో ఆనందోత్సాహాలు నింపాలని ఆకాంక్షించారు.వాతావరణ శాఖ, రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచనలను పరిగణలోకి తీసుకుని రైతులు పంటలకు సిద్ధం కావాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో వేగంగా వస్తున్న మార్పులు, కొన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ముందస్తు అంచనాలను దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రైతాంగాన్ని కోరారు.కొన్ని పరిమితమైన పంటల సాగుపైన దృష్టి సారించడం వల్ల పప్పుధాన్యాలు, వేరుశనగ, పెసలు, మినుములు, నువ్వులు వంటి పంటలను దిగుమతి చేసుకోవలసిన పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ఇలాంటి సమస్యలను అధిగమించడంతో పాటు వరుసగా ఒకే పంటను సాగు చేయడం వల్ల నేల సారం తగ్గి తెగుళ్ల సమస్యలు కూడా పెరుగుతున్నాయని, వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా పంట మార్పిడి వల్ల నేల సారం పెరగడమే కాకుండా దీర్ఘకాలంలో అధిక దిగుబడులు అందించే పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ మృగశిర కార్తె అన్నదాతలకు శుభారంభం కావాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పుష్కలమైన పంటలు పండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# కోరుట్లలో కనిపించకుండా పోయిన యువకుడి కేసులో విషాదాంతం

**తన కొడుకు ఎక్కడున్నాడో తెలిస్తే చెప్పండి అంటూ తల్లి ఆవేదన**

**హైదరాబాద్ పెన్ పవర్:** కోరుట్లలో కనిపించకుండా పోయిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామం నుండి అంకం రాహుల్ అనే యువకుడు వచ్చి సైదాబాద్ మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3తీఁ ఇయర్ చదువుతున్నాడు. గత నెల 27వ తేదీన టూర్కు వెళ్తున్నానని చెప్పి కాచిగూడలో ఎంఎంటీఎస్ రైలు ఎక్కి, సికింద్రాబాద్ నుండి శబరి ఎక్స్ప్రెస్లో ఒంగోలు పరిధిలోని సింగరాయకొండ చేరుకుని అక్కడ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 30వ తేదీన గుర్తుతెలియని వ్యక్తిగా సింగరాయకొండ పోలీసులు కేసు నమోదు చేసారు. 31వ తేదీన మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, సింగరాయకొండలో రైలు దిగి ఆత్మహత్యకు పాల్పడినట్టు కాచిగూడ పోలీసులు గుర్తించారు.

# 2015 నుండి ఈరోజు వరకు కంటోన్మెంట్ ఎన్నికలు నిర్వహించడంలేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** హిట్లర్ నాకు స్ఫూర్తి అని రేవంత్ రెడ్డి చెబుతున్నాడు. హిట్లర్ హంతక బృందం స్ఫూర్తితోనే హైడ్రాను ఏర్పాటు చేసానని చెప్పాడు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంతో పేదల ఇళ్ల కూల్చివేతలను పోల్చుతున్నాడని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి క్రిశాంక్ ఆరోపించారు. హిట్లర్ చేసిన తప్పులకు జర్మనీ ప్రజలు ఇప్పటికీ క్షమాపణ చెబుతూనే ఉన్నారు.. అలాంటి వ్యక్తి రేవంత్ రెడ్డికి స్ఫూర్తి అంట? ఇవాళ దాన్ని ప్రశ్నించినందుకు కేసులు పెడుతున్నారు. మాట్లాడింది రేవంత్ రెడ్డి అయితే మా మీద కేసులు ఏంది.. కేసు వేయాల్సింది రేవంత్ రెడ్డి మీద కదా? ట్వీట్ చేసిన వాళ్ల మీద కేసు పెడితే ఎక్స్ వాళ్ళు వాళ్లకు సమాచారం ఇవ్వొద్దని పోలీసులు నోటీసులో పేర్కొన్నారు.. సమాచారం ఇస్తే దేశం వదిలి పారిపోతాం అంట. ఇది కాదా అసలైన హిట్లర్ పాలన అని ప్రశ్నించారు..

బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్కు వ్యతిరేకంగా సొంత పార్టీకి చెందిన మరో ఎంపీ బ్యానర్లు కట్టిస్తున్నాడు. 2015 నుండి ఈరోజు వరకు కంటోన్మెంట్ ఎన్నికలు నిర్వహించలేదు. అప్పటి నుండి బీజేపీ నామినేటెడ్ సభ్యులను నియమిస్తుంది, ఈరోజు వారిలో వారే గొడవలు పడుతున్నారు. మా కంటోన్మెంట్ అంటే ఎందుకు ఇంత నిర్లక్ష్యం ఈటెల రాజేందర్ గారని నిలదీసారు.

# సెల్ టవర్ కు వ్యతిరేకంగా స్థానికుల ధర్నా

**సికింద్రాబాద్ పెన్ పవర్:** సెల్ టవర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా కాంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ముందు స్థానికులు ధర్నా చేశారు. కాంటోన్మెంట్ లోని భూసరెడ్డి గూడలో సెల్ టవర్ ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఈ సెల్ టవర్ ఏర్పాటు వలన భూసరెడ్డి గూడ, ఎల్ ఐ సీ కాలనీ, భాస్కర్ రావు గార్డెన్ తదితర ప్రాంతాల ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. డీసీపీ కి, బోర్డు సీఈఓ కు గతంలోనే పిర్యాదు చేయడం జరిగిందని, కానీ పని ఆపకుండా యధావిధిగా సాగితుందని, సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్న స్థలం కూడా ఎయిర్ లైన్స్ కు సంబందించినదని వివాదంలో ఉన్నదని చెప్పారు. అటువంటి స్థలంలో సెల్ టవర్ ఏర్పాటుకు అనుమతులు ఏ విదంగా ఇచ్చారని ప్రశ్నించారు. ఇప్పయికైనా పూనుకొని సెల్ టవర్ ఏర్పాటును విరమింప చేయాలని సీఈఓ కు విజ్ఞప్తి చేసారు.

## ఆకాశనంటిన చేపల ధరలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మృగ శిర కార్తె ను పురస్కరించుకుని హైదరాబాద్ మార్కెట్ లో చేపల ధరలు ఆకాశానంటాయి. గుడి మల్కాపూర్ మార్కెట్ లో చేపలు కొనేందుకు ప్రజలు ఎగబడ్డారు. పాంప్లేట్ 140. రాయి చేపలు 180. మరల్ 450 రూపాయలు కిలో అమ్ముతున్నారు. ధరలు పెరగడంతో జనాల పై భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు.

# తార్నాక లో స్వచ్ఛ ఆటో ట్రాలీ డ్రైవర్లు మరియు కార్మికుల నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:** నగరంలో వ్యర్థాల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రాంకీ సంస్థకు కమర్షియల్ కు చెందిన చెత్త సేకరణ ను అప్పగిస్తే చేసిన తమ ఉపాధి దెబ్బతింటుందని స్వచ్ఛ ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆటో ట్రాలీ డ్రైవర్లు మరియు కార్మికులు తార్నాక లోని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. "రాంకీ, గో బ్యాక్" " అంటూ నినాదాలు చేశారు. వాణిజ్య సంస్థల నుండి చెత్త సేకరణ బాధ్యతను సదరు సంస్థకు అప్పగించిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చిన్న వాణిజ్య సంస్థలకు కూడా నోటీసులు జారీ చేసి, తమ చెత్తను ఆ సంస్థకే అప్పగించాలని రాంకీ ప్రయత్నించడం తమ జీవనోపాధిపై దెబ్బ కొట్టే చర్య అని అన్నారు. ప్రభుత్వం తగిన చర్య తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకి దిగుతామని స్వచ్ఛ ఆటో కార్మికుల హెచ్చరించారు...

# ఇధనాల్ ఆయిల్ వచ్చేసింది....

**హైదరాబాద్, జూన్ 8, పెన్ పవర్:** భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇది ఇంధన రంగంలో కీలక మలుపు. కేంద్ర పెట్రోలియం మంత్రి హరదీప్ సింగ్ పురి ఢిల్లీలో ఈ--85 ఇంధనాన్ని అధికారికంగా లాంచ్ చేశారు. ఇందులో 80--85% ఇథనాల్, 14--19% పెట్రోల్ ఉంటాయి. ఢిల్లీలో దీని ధరూ.82.12గా నిర్ణయించారు. సాధారణ పెట్రోల్ ధరకన్నా రూ.20 తక్కువకే ఈ--85 ఇంధనం అందుబాటులోకి వచ్చింది.ఈ--20ను షెడ్యూల్ కంటే ముందే సాధించిన భారత్, ఇప్పుడు ఉన్నత స్థాయి ఇథనాల్ బ్లెండింగ్ దిశగా ధైర్యవంతమైన అడుగు వేసింది.ఈ--85 అనేది ఫ్లెక్స్ ఫ్యూయల్ వెహికిల్స్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఇంధనం. సాధారణ కార్లు, బైకులు దీన్ని ఉపయోగించలేవు. ఇంజన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు మాత్రమే ఈ--85ను సమర్థవంతంగా ఉపయోగించగలవు. ప్రస్తుతం హీరో మోటోకార్ప్ (స్ప్లెండర్ం ఫ్లెక్స్ ఫ్యూయల్, ఏఈ డీలక్స్), సుజుకి గిక్సర్ ఎస్ఎఫ్ 250 వంటి కొన్ని మోడల్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మారుతి సుజుకి వాగన్‌ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ వెర్షన్‌ను త్వరలో మార్కెట్‌లోకి తీసుకురావాలని యోచిస్తోంది.ఈ--85 ధర తగ్గడం వినియోగదారులకు తక్షణ ప్రయోజనం. కానీ నిజమైన లాభం దేశ స్థాయిలో ఉంది. ఈ--20 పాలసీ ద్వారా ఇప్పటికే రూ.1.84 లక్షల కోట్ల విదేశీ మారక నిల్వలు ఆదా అయ్యాయని మంత్రి పురి తెలిపారు. ఈ--85 విస్తరణతో ఈ సేవింగ్స్ ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇథనాల్ దేశీయంగా ఉత్పత్తి అవుతుంది కాబట్టి క్రూడ్ ఆయిల్ దిగుమతులు తగ్గుతాయి, డాలర్ ఖర్చు తగ్గుతుంది. రైతులకు అదనపు ఆదాయం (పంచదార, మొక్కజొన్న, 2ఎ ఇథనాల్ ద్వారా వ్యవసాయ వ్యర్థాలు) వస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి లభిస్తుంది.ఈ--85 సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే 50--60% తక్కువ కార్బన్ ఎమిషన్లను విడుదల చేస్తుంది. వాయు కాలుష్యం తగ్గడం, ఆరోగ్య సమస్యలు తగ్గడం దీర్ఘకాలిక లాభాలు. వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే రోజే ఈ -- 85ను లాంచ్ చేయడం యాదృచ్ఛికం కాదు. ఇది సవాలుతో కూడిన మార్గం. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు ఇంకా చాలా తక్కువప్రస్తుతం ఢిల్లీ--ఎన్‌సీఆర్, ముంబై, పూణే, నాగ్‌పూర్‌లో మాత్రమే 50 పెట్రోల్ బంకుల్లో అందుబాటులో ఉంది. 2026 చివరి నాటికి 500 స్టేషన్లు, 2027 నాటికి 5,000 స్టేషన్లు అన్నది లక్ష్యం.ఇంజన్ పనితీరు, మైలేజ్, శీతాకాలంలో కోల్డ్ స్టార్ట్ సమస్యలు కూడా పరిశీలించాల్సి ఉంది.ఈ--85 లాంచ్ భారత్‌ను ఇంధన దిగుమతి భారం నుంచి విముక్తి కగిలిస్తుంది. ఇది రైతు, పర్యావరణం, ఆర్థిక స్వావలంబన, శక్తి భద్రత నాలుగు లక్ష్యాలను ఏకకాలంలో సాధించే అవకాశం ఇస్తోంది. ఇది విజయవంతం కావాలంటే కేవలం లాంచ్ చేయడం సరిపోదు. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల ఉత్పత్తిని వేగవంతం చేయడం, ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను త్వరగా విస్తరించడం, వినియోగదారుల్లో అవగాహన కల్పించడం ఇవన్నీ ఒకేసారి జరగాలి.

# ఏఐసీసీ రేసులో....

**హైదరాబాద్ జూన్ 8, పెన్ పవర్:** తెలంగాణ నుంచి ఏఐసీసీలో ఎవరెవరికి చోటు దక్కే అవకాశం ఉంది? ఒకరిద్దరు మంత్రుల్ని కూడా పార్టీ హెడ్క్వార్టర్స్‌కు పంపుతారన్నది నిజమేనా? అసలు మార్పుల విషయమై కాంగ్రెస్ వర్గాల అంచనాలు ఎలా ఉన్నాయి? దేశ వ్యాప్తంగా పార్టీ ప్రక్షాళనకు డిసైడ్ అయ్యింది కాంగ్రెస్ అధిష్టానం. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నాయకుల సేవలు ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఈ ప్రక్రియ గురించి ప్రస్తుతం పార్టీ వర్గాల్లో రకరకాల ఆసక్తికరమైన చర్చలు నడుస్తున్నాయి. ఆలిండియా కాంగ్రెస్ కమిటీలో భారీ మార్పులు ఉంటాయన్న సంకేతాల నడుమ తెలంగాణ నాయకుల స్థానం ఎక్కడన్న ఆరాలు మొదలయ్యాయి. రాష్ట్రం నుంచి ఏఐసీసీలో ఎవరికి చోటు దక్కుతుంది..? ఇక్కడి సీనియర్ నాయకుల సేవల్ని అక్కడ వాడుకోవాలని భావిస్తోందా..!? ఇంతకీ... తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో ఎవరు ఏఐసీసీలోకి వెళ్ళబోతున్నారనే చర్చలు పార్టీ వర్గాల్లో జోరుగా జరుగుతున్నాయి. సాధారణంగా ఏఐసీసీ పోస్టుల భర్తీ విషయంలో అన్ని రాష్ట్రాలకు వాటా దక్కుతుంది. అవసరం, అవకాశాన్ని బట్టి ప్రాధాన్యతలు మాత్రమే మారుతుంటాయి. తెలంగాణ నుంచి చాలామంది నాయకులు ప్రస్తుతం ఏఐసీసీ కార్యదర్శులుగా బాధ్యతల్లో ఉన్నారు.మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కీ.. చిన్నారెడ్డి..వంశీ...సంపత్ లాంటి వాళ్ళు ఆ పదవుల్లో ఇంకా కొనసాగుతున్నారు. ఈసారి ఏఐసీసీలో అధికార ప్రతినిధులు.. మరి కొన్ని పదవుల్లో కూడా తెలంగాణకి ప్రాధాన్యత దక్కే అవకాశం లేకపోలేదు. అయితే...దానికి అనుబంధంగా మరో ఆసక్తికరమైన చర్చ కూడా జరుగుతోంది. రాష్ట్రంలో క్యాబినెట్ విస్తరణ గనుక జరిగితే ఒకరిద్దరు మంత్రులను తప్పిస్తారన్న ప్రచారం ఉంది. అందులోనూ కీలకంగా ఉండే వాళ్లనే బయటికి పంపుతారన్న ప్రచారంతోఒకవేళ అదే జరిగితే వాళ్లని ఎలా సంతృప్తి పరుస్తారన్న ప్రశ్నలు వస్తున్నాయి. కేబినెట్ నుండి తప్పించే పరిస్థితే ఉంటేసదరు నేతల్ని ఏఐసీసీలోకి తీసుకుని పొరుగు రాష్ట్రాలకు పార్టీ ఇన్ఛార్జ్‌లుగా పంపవచ్చని తెలుస్తోంది. పార్టీలో కీలకంగా క్రియాశీలకంగా పని చేసిన వాళ్ళేగనక ఆ లిస్ట్‌లో ఉంటే ఏఐసీసీలోకి తీసుకోవాలన్న ఆలోచన కూడా జరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు. మంత్రులను పక్కనబెడితే పార్టీ కోసం పని చేస్తున్న వారిలో మరికొందరిని అధిష్టానం హెడ్ క్వార్టర్స్‌లోకి తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఎఐసిసిలో ఉన్న వాళ్లను కంటిన్యూ చేస్తారా..? లేదంటే కొత్త వారిని కూడా తీసుకుంటారా అనేది ... వారంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది

# ఆర్మూర్ లో గుప్తా వర్సెస్ గుప్తా

**నిజామాబాద్ జూన్ 8, పెన్ పవర్:** నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మధ్య రాజకీయ వైరం పీక్స్‌కు చేరిందట. ఇద్దరి మధ్య విమర్శలు ప్రతివిమర్శలు, సవాళ్లు-ప్రతిసవాళ్లతో స్థానిక రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బీజేపీ శాసనసభ్యుడు ధన్‌పాల్‌కు మాస్ లీడర్‌గా ప్రజల్లో గుర్తింపు ఉంది. వివాదాలకు దూరంగా, నిత్యం ప్రజలకు దగ్గరగా ఉంటారని కూడా చెప్పుకుంటారు. ఇటు మాజీ ఎమ్మెల్యే బిగాలను మిస్టర్ డెవలప్‌మెంట్ అని పిలుస్తుంటారు స్థానికంగా. పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన బిగాల గణేష్ గుప్తా... అర్బన్ అభివృద్ధికి బాగానే పని చేసినట్టు చెప్పుకుంటారు. అలా... ఇద్దరిలో ఎవరి క్రేజ్ వారికి ఉన్నా.... ఇద్దరిదీ ఒకే సామాజికవర్గం అయినా....చెరో పార్టీలో ఉండటం వల్ల ఏళ్ళుగా రాజకీయ వైరం కొనసాగుతోంది. గతంలో బిగాల ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు.. ప్రతిపక్ష నేతగా ఉన్న ధన్‌పాల్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేసేవారు. అభివృద్ధి పనుల్లో జాప్యంపై సమయం దొరికినప్పుడల్లా మాటల తూటాలు పేల్చేవారు. అలా.. ఇద్దరు ఉప్పు-నిప్పులా మారారు. కానీ... తర్వాత ఓడలు బండ్లు- బండ్లు ఓడలు అయ్యాయినిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున ధన్‌పాల్ ఎమ్మెల్యే అవగా... బిగాల మాజీగా మిగిలిపోయారు. తన హయాంలో మొదలుపెట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత ఎమ్మెల్యే ధన్‌పాల్ కావాలనే నిర్వీర్యం చేస్తున్నారంటూ అవకాశం దొరికినప్పుడల్లా.. విమర్శిస్తున్నారు మాజీ ఎమ్మెల్యే. అందుకు సిట్టింగ్ కూడా ఎప్పటికప్పుడు కౌంటర్ ఇస్తున్నారు. ఐతే ఇప్పుడు ఆ విమర్శల పరంపర పీక్స్‌కు చేరుకుంది. మున్సిపాలిటీలో ఎండిన మొక్కల సాక్షిగా పొలిటికల్ ప్రకంపనలు రేగుతున్నాయి. అసలే దశాబ్దకాలంగా సాగుతున్న వైరానికి ఇప్పుడీ ఎండు మొక్కల కారణంగా మంట గట్టిగానే అంటుకుంది. నిజామాబాద్‌లో డివైడర్స్ మధ్య తన హయాంలో నాటిన మొక్కలు ఇటీవల ఎండిపోవడం చూసి చలించిపోయారట మాజీ ఎమ్మెల్యే బిగాల. ఆ ఎండిన చెట్లకే బిందెలతో స్వయంగా నీళ్లు పోసి నిరసన తెలిపారాయన. ఇటు మినీ ట్యాంక్‌బండ్‌కు నెల రోజులుగా తాళం వేసి ఉండటాన్ని చూసి స్వయంగా పరిశీలించారాయన. తర్వాత బీజేపీ ఎమ్మెల్యే పై సోషల్ మీడియాలో విరుచుకుపడ్డారు ఎక్స్ ఎమ్మెల్యే. ఉద్దేశ్యపూర్వకంగానే తన హయంలో చేసిన అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారంటూ విమర్శించారు బిగాల. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా రాజీనామా కోసం డిమాండ్ చేశారు. అందుకు ధన్‌పాల్ కూడా ఘాటుగా రియాక్ట్ అయ్యారు.

# కామారెడ్డిలో యూరియా కష్టాలు

**కామారెడ్డి పెన్ పవర్:** కామారెడ్డి జిల్లాలో రైతులు యూరియా దొరకక ఇబ్బంది పడుతున్నారు. యాప్ విధానం ద్వారా యూరియాను బుక్ చేసుకోవడం కష్టమవుతుందంటూ సొసైటీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. యూరియాను యాప్ విధానం ద్వారా అందించడం రద్దుచేసి మ్యానువల్ పద్ధతిలో అందించాలని రైతుల డిమాండ్. సదాశివ నగర్ మండలం పద్మా జీవాడి ఎక్స్ రోడ్ సొసైటీ ముందు ఆందోళనకు దిగారు. యూరియా బ్లాక్ మార్కెట్లకు తరలిపోతుందని, కాంగ్రెస్ నాయకులకు కనుసన్నల్లోనే యూరియా అందజేస్తున్నారని సొసైటీ ముందు నిరసన తెలిపారు. సదాశివ నగర్ మండలంలో ఏ ఒక్క సొసైటీలో యూరియా దొరకడంలేదు. బాన్సువాడ నియోజకవర్గంలోని నరసుర్లాబాద్, బీర్కూర్ మండలంలోని రైతులకు దొరకడంలేదు. మహారాష్ట్రలోని దెగ్లూరు నుండి యూరియాను రైతులు బ్లాక్ మార్కెట్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రతి 12 కొత్త వాహనాల్లో ఒకటి ఎలక్ట్రిక్

**హైదరాబాద్, జూన్ 8, పెన్ పవర్:** తెలంగాణలో 2025-26 ఫైనాన్షియల్ ఇయర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది రిజిస్టర్ అయిన మొత్తం 10.62 లక్షల కొత్త వాహనాల్లో 91,637 ఎలక్ట్రిక్ వాహనాలే (8.6 శాతం). అంటే ప్రతి 12 వాహనాల్లో ఒకటి ఈవీ కావడం విశేషం. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే సగానికి పైగా వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 769.81 కోట్ల జీవితకాల పన్ను మినహాయింపులను అందించడం ఈ వృద్ధికి కీలక దోహదకారిగా నిలిచిందని నిపుణులు చెబుతున్నారు.తెలంగాణలో పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థ దిశగా అడుగులు శరవేగంగా పడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2025-26) లో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఈ కాలంలో మొత్తం 91,637 ఎలక్ట్రిక్ వాహనాలు రవాణా శాఖ వద్ద నమోదయ్యాయి. ఈ ఏడాది రాష్ట్రంలో నమోదైన మొత్తం 10.62 లక్షల కొత్త వాహనాలలో ఇవి ఏకంగా 8.6 శాతం వాటాను దక్కించుకోవడం విశేషం. ఈ గణాంకాలను పరిశీలిస్తే.. తెలంగాణలో రిజిస్టర్ అయిన ప్రతి 12 కొత్త వాహనాలలో ఒకటి ఖచ్చితంగా ఎలక్ట్రిక్ వాహనమేనని స్పష్టమవుతోంది.రాష్ట్రంలో వాహనాల కొనుగోలు సామర్థ్యం, సొంత వాహనాల వాడకం విపరీతంగా పెరుగుతున్న తరుణంలోనే

ఈ ఈవీ విప్లవం కూడా ఊపందుకుంది. 2025-26 లో తెలంగాణ రోడ్లపైకి రికార్డు స్థాయిలో 10.62 లక్షల నూతన వాహనాలు వచ్చాయి. అంటే సగటున ప్రతిరోజూ దాదాపు 2900 కొత్త వాహనాలు రాష్ట్ర రవాణా నెట్‌వర్క్‌లో భాగమవుతున్నాయి. శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ, ప్రజల తలసరి ఆదాయం, వ్యయ సామర్థ్యం పెరగడం, విస్తరిస్తున్న పారిశ్రామిక కార్యకలాపాలు, ముఖ్యంగా హైదరాబాద్ మహానగర పరిసరాల్లో వ్యక్తిగత ప్రయాణ సాధనాలకు పెరిగిన డిమాండ్ ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.గ్రేటర్ హైదరాబాద్, దాని పరిసర ఐటీ కారిడార్ పరిధిలోని జిల్లాలే ఎప్పటిలాగే వాహన రిజిస్ట్రేషన్లలో సింహభాగాన్ని ఆక్రమించాయి. హైదరాబాద్ జిల్లాలో 1,97,539 కొత్త వాహనాలతో మొదటి స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జిల్లాలో 1,87,044 రిజిస్ట్రేషన్లతో తర్వాతి స్థానాన్ని దక్కించుకుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1,75,630 నూతన వాహనాలతో మూడో స్థానంలో నిలించింది. ఈ మూడు జిల్లాల పరిధిలోనే రాష్ట్రంలోని మొత్తం కొత్త వాహన రిజిస్ట్రేషన్లలో సగానికి పైగా అంటే 50 శాతానికి పైనే నమోదు కావడం గమనార్హం.

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించడానికి, కొనుగోలుదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీలు, పన్ను మినహాయింపులను సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈవీ కొనుగోలుదారులకు ఏకంగా రూ. 769.81 కోట్ల విలువైన లైఫ్‌టైమ్ టాక్స్ మినహాయింపులను ప్రభుత్వం పొడిగించింది. ఈ భారీ ప్రోత్సాహకాలు ఈవీల ప్రారంభ కొనుగోలు వ్యయాన్ని తగ్గించి, పెట్రోల్-డీజిల్ వాహనాల నుండి బ్యాటరీ వాహనాల వైపు వేగంగా మారడానికి పౌరులను ప్రేరేపిస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

# 10 శాతం పెరగనున్న మద్యం ధరలు



**హైదరాబాద్, జూన్ 8, పెన్ పవర్:** తెలంగాణలోని మందుబాబులకు నిజంగా ఇది చేదువార్తే. రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉంది. ధరల సవరణపై ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల దృష్ట్యా మద్యం ధరలను కనీసం 10 శాతం పెంచాలని కంపెనీలు డిమాండ్ చేస్తుండగా.. ధరలు పెంచితే పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి సరిహద్దుల ద్వారా అక్రమ మద్యం రవాణా పెరిగే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సంప్రదింపులు జరుపుతోంది.తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం ధరల సవరణపై అధ్యయనం చేయడానికి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ అధ్యక్షతన ఏర్పాటైన త్రిసభ్య కమిటీ బుధవారం నుండి మూడు రోజుల సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. ఈ కమిటీలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, చార్టర్డ్ అకౌంటెంట్ నవీన్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. మద్యం కొనుగోలు ధరల పెంపు నిర్ణయం ఇప్పుడు ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖకు పెద్ద సవాల్‌గా మారింది. ఒకవైపు మద్యం కంపెనీల నుంచి వస్తున్న ధరల పెంపు ఒత్తిడి, మరోవైపు ధరలు పెంచితే పొరుగు రాష్ట్రం నుండి ముంచుకొచ్చే అక్రమ మద్యం స్మగ్లింగ్ ముప్పు.. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించేందుకు ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. విచారణలో మద్యం తయారీ కంపెనీల ప్రతినిధులు కమిటీ ముందు హాజరై తమ నివేదికలను సమర్పించారు. మద్యం తయారీకి అవసరమయ్యే ముడిసరుకులు, ప్యాకేజింగ్ మెటీరియల్స్, రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని వారు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా తమకు లాభసాటిగా ఉండాలంటే కనీసం 10 శాతం మేర కొనుగోలు ధరలను పెంచాలని వారు అభ్యర్థించారు. అయితే మద్యం కంపెనీల డిమాండ్ సమంజసంగానే ఉన్నప్పటికీ ధరలను భారీగా పెంచితే అది రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయానికి గండికొట్టే ప్రమాదం ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణ సుదీర్ఘమైన అంతరాష్ట్ర సరిహద్దును పంచుకుంటోంది. తెలంగాణలో మద్యం ధరలు గనుక విపరీతంగా పెరిగితే.. రెండు రాష్ట్రాల మధ్య రేట్ల వ్యత్యాసం భారీగా పెరుగుతుందని అంటున్నారు.తెలంగాణలో కొనుగోలు ధరలు పెరిగితే.. అది అంతిమంగా రీటైల్ ధరలపై ప్రభావం చూపుతుంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో గనుక రీటైల్ ధరలు తక్కువగా ఉంటే సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, గద్వాల వంటి ప్రాంతాల ప్రజలు ఆంధ్రప్రదేశ్ నుంచి మద్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల తెలంగాణకు రావాల్సిన పన్నుల రూపంలోని భారీ ఎక్సైజ్ రాబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని అధికారులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. అటు కంపెనీల ప్రయోజనాలను కాపాడుతూనే ఇటు సరిహద్దు ముప్పును అరికట్టేలా జస్టిస్ సునీల్ కిషోర్ కమిటీ ఎలాంటి సిఫార్సులు చేయబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సిద్ధిపేట రైల్వే స్టేషన్ పనులు పూర్తి

**మెదక్ జూన్ 8, పెన్ పవర్:** తెలంగాణలో మరో రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేసుకుని.. ప్రారంభోత్సవానికి రెడీ అయింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి రైలు స్టేషన్ పనులు దాదాపు పూర్తి అయినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాజీవ్ రహదారికి పక్కనే, కొమురవెల్లి మల్లన్న ఆలయానికి దగ్గర్లో ఉండే ఈ రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తే.. ఆ పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణం, కొత్త రైలు మార్గాలు, పాత రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తోంది. దీంతో తెలంగాణలో ఇప్పటికే పలు కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణాలు పూర్తై అందుబాటులోకి రాగా.. మరికొన్నింటి నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. ఇక కొన్ని రైల్వే స్టేషన్‌లకు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా తెలంగాణలో ప్రముఖ దేవస్థానమైన కొమురవెల్లి మల్లన్న ఆలయానికి అతి దగ్గర్లో కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతోంది. అయితే కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని.. త్వరలోనే భక్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి వెళ్లే

భక్తులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు.. లకుడారం – దుద్దెడ మధ్య రైల్వే శాఖ కొమురవెల్లి హాల్ట్ రైల్వే స్టేషన్‌ను నిర్మిస్తోంది. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు 99 శాతం పూర్తి అయ్యాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శనివారం ఒక ట్వీట్ చేశారు. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణానికి 2024 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేయగా.. రూ. 5.63 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అత్యంత వేగంగా నిర్మించారు.ఇక రైల్వే ప్రయాణికుల కోసం ఈ కొమురవెల్లి స్టేషన్‌లో పలు అత్యాధునిక వసతులను కల్పించారు. 450 మీటర్ల పొడవైన హై లెవల్ ప్లాట్‌ఫారమ్.. 5 షెల్టర్లు, విశాలమైన వెయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్లు, తాగునీటి వసతి.. మహిళలు, పురుషులు, దివ్యాంగులకు స్పెషల్ మరుగుదొడ్లను నిర్మించారు. ఈ రైల్వే స్టేషన్‌కు మెరుగైన అప్రోచ్ రోడ్లు, విశాలమైన పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కొమురవెల్లి రైల్వే స్టేషన్ ఆర్కిటెక్చరల్ ఎలివేషన్, మల్లన్న స్వామి, స్థానిక ప్రకృతి అందాలను ప్రతిబింబించే చిత్రాలను రూపొందించారు.

ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణంతో భక్తులు మల్లన్న దేవాలయానికి సులభంగా, నేరుగా చేరుకునే అవకాశం కలగనుంది. రాజీవ్ రహదారికి (ఎస్‌హెచ్-1) సమీపంలో ఈ రైల్వే స్టేషన్ ఉండటం వల్ల ప్రయాణం మరింత సజావుగా సాగుతుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో రూపుదిద్దుకున్న ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ ద్వారా తెలంగాణలో ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపడటమే కాకుండా.. ఆధ్యాత్మిక పర్యాటకానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతం లభిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.


# పార్టీలకతీతంగా భూ దందాలు

**నెల్లూరు, జూన్ 8, పెన్ పవర్:**
వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కావలి నియోజకవర్గంలో రకరకాల భూ దందాలు జరిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఔట్స్ వేశారు. అప్పటి అధికారులను మేనేజ్ చేసుకుని మరికొందరు ప్రభుత్వ, కాలువ భూములను పట్టా భూములుగా చూపించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దానికి సంబంధించి అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి ప్రధాన అనుచరుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి మీదే ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. ఆయనతో పాటు మరో నలుగురు వేసిన లేఔట్లపై కూడా ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు జరుగుతోంది. అధికారులు లోతుల్లోకి వెళ్ళి దర్యాప్తు చేస్తుండటంతో అక్రమార్కులకు వణుకు పుడుతోందట. ఆ క్రమంలోనే... వాళ్ళు సరికొత్త ఆలోచనలకు పదును పెట్టే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం కలకలం రేపుతోంది. గత ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి గెలిచాక వైసీపీ హయాంలో వేసిన అక్రమ లేఔట్లపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే ఇటీవల ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అది తుది దశకు చేరుకుందనుకుంటున్న సమయంలో దర్యాప్తు అధికారుల మీద దౌర్జన్యాలు జరగడం కలరలం రేపుతోంది. వీటి వెనక స్థానిక టిడిపి నేతలు ఉన్నారన్న మాటలతో ఇంకా షాకవుతున్నారట స్థానికులు. అసలు అక్రమ లేఔట్లపై దర్యాప్తు ప్రారంభించిన విజిలెన్స్ అధికారులకు మొదట రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సహకరించలేదట. రికార్డులు ఇచ్చేందుకు కూడా కింది స్థాయి అధికారులు ఆసక్తి చూపలేదని తెలిసింది. చివరికి కలెక్టర్ ఆదేశాలతో రికార్డులు తెప్పించుకున్న విజిలెన్స్ అధికారులు సుమారు 78 లేఅవుట్లను పరిశీలించారు. ఇందులో చాలావరకు అక్రమాలు జరిగాయని ప్రాథమిక దర్యాప్తులో బయటపడిందని అంటున్నారు. ముగ్గురు వ్యక్తులు అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని సుమారు 300 ఎకరాల్లో అక్రమ లేఔట్లు వేసినట్టు ప్రాథమిక అంచనాకి వచ్చారట. ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు కూడా చేశారని.. వాటి విలువ ఇప్పుడు 100 కోట్లకు పైనే ఉంటుందని దర్యాప్తు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో.. దీని నుంచి తప్పించుకునేందుకు అప్పట్లో అక్రమాలకు పాల్పడ్డ వాళ్ళంతా ఇప్పుడు టిడిపి ద్వితీయ శ్రేణి నేతలతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారన్న ప్రచారం కావలిలో కాక రేపుతోంది. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల బండారం విజిలెన్స్ ఎంక్వయిరీలో బయటపడుతూ ఉండడంతో ...వాళ్ళంతా ఉలిక్కిపడుతున్నారట. ఎలాగైనా దర్యాప్తును అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో అధికార పార్టీ నేతలకు టచ్ లోకి వెళ్లినట్టు చెప్పుకుంటున్నారు. ఆ టచ్చింగ్స్ కారణంగానే.... కావలి ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామకృష్ణ... విజిలెన్స్ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని సొంత పార్టీలోనే మాట్లాడుకుంటున్నారు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితంగా ఉన్న కీలక నేత ఒకరు.. ఇప్పుడు టిడిపి నేతలకు వెనకుండి గైడ్ చేస్తున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. మరోవైపు ఇప్పటికే అక్రమ లేఔట్లకు సంబంధించిన సూత్రధారులను గుర్తించిన విజిలెన్స్ అధికారులు.. వారికి సహకరించిన రియలెస్టేట్ బ్రోకర్స్, డాక్యుమెంట్ రైటర్ల వివరాలు సేకరిస్తున్నారట. దొరికిన వాళ్ళ నుంచి స్టేట్మెంట్స్ రికార్డు చేసే కార్యక్రమం కూడా నడుస్తోందని అంటున్నారు. అయితే విజిలెన్స్ విచారణకు సహకరించొద్దంటూ బ్రోకర్లు, డాక్యుమెంట్ రైటర్స్‌ను కూడా సదరు సదరు కీలక నేతే బెదిరిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. దర్యాప్తు పూర్తి చేసి నెలాఖరులోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులు గట్టిగా పనిచేస్తుంటే.. అది పూర్తయితే తమపై క్రిమినల్ కేసులు పెట్టే ప్రమాదం ఉందని అక్రమార్కులు భయపడుతున్నారట. అందుకే... ఎంక్వయిరీని ఆలస్యం చేసేందుకు.. స్థానిక ద్వితీయ శ్రేణి టిడిపి నేతలను రెచ్చగొట్టి అధికారుల మీదకు పంపుతున్నారన్నది లోకల్ టాక్. మా లేఔట్స్ మీద విచారణ చేసే అధికారం ఎవరిచ్చారంటూ విజిలెన్స్ అధికారులను బెదిరించడం కూడా టిడిపి ద్వితీయ శ్రేణి నేతల ప్లాన్‌లో భాగమేనని, అక్రమార్కులే తెరవెనుక ఉండి వాళ్లని పురమాయిస్తున్నారన్న ప్రచారం కావలిలో జరుగుతోంది. టీడీపీ నాయకులు దాడి చేసిన వ్యవహారాన్ని ఇప్పటికే విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారట. సదరు నేతపై కేసు నమోదు చేసినప్పటికీ దీనికి సంబంధించి అటు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గానీ.. జిల్లా అధ్యక్షులు, అదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గాని నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని సొంత పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. ఇన్ని ఆటంకాల మధ్య అక్రమ లేఔట్స్‌పై విజిలెన్స్ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందా..? అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెడతారా అనేది ఉత్కంఠ గా మారింది.

# కార్గో వ్యతిరేక ఉద్యమం...

**శ్రీకాకుళం,జూన్ 8, పెన్ పవర్:**
అసెంబ్లీ ఎన్నికల్లో పలాస నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు గౌతు శిరీష. ఇప్పుడు ఆమెకే నియోజకవర్గంలో సరికొత్త సమస్యలు ఎదురవుతున్నాయట. పార్టీ పవర్‌లో ఉండటం, తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన, జిల్లా వాసి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ఉండటంతో పలాసకు ఓ మంచి ప్రాజెక్ట్ తీసుకురావాలని భావించారట ఎమ్మెల్యే. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేయటంతో పాటు ఉపాధి అవకాశాలు సృష్టించేలా ప్రాజెక్ట్ కోసం ప్రయత్నించారామె. ఆ క్రమంలోనే పలాస ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ పెట్టాలని నిర్ణయించారు. ఇక్కడికి ఆ ప్రాజెక్ట్ వస్తే ఉద్దానం ప్రాంతం అభివృద్ధి అవుతుందంటూ ప్రచారం మెదలు పెట్టారు. అందుకు అవసరమైన భూ సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేగా గౌతు శిరీష కూడా స్థానికులతో మాటాడే ప్రయత్నం చేస్తున్నారట. కానీ పాలకులు చెబుతున్న అభివృద్ధి మాటల్ని స్థానికులు విశ్వసించడం లేదు. పైగా పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక ఉద్యమం మొదలైంది. మాకసలు అది వద్దే వద్దంటూ పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సమావేశాల్లో సైతం మా ప్రాంతానికి కార్గో ఎయిర్‌పోర్ట్ అవసరం లేదని చెప్పేస్తున్నారు. అందుకు వాళ్ళ రీజన్స్ వాళ్ళకు ఉన్నాయి. పెద్దగా ఉపాధి అవకాశాలు ఇవ్వని కార్గో ఎయిర్ పోర్టు కోసం వేలాది ఎకరాల్లో ఉన్న జీడి, కొబ్బరి, మామిడి తోటల్ని పణంగా పెట్టేలేమన్నది స్థానిక రైతుల మాట. దీని గురించే ఇప్పుడు పలాసతో పాటు శ్రీకాకుళం జిల్లాలో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలోని పల్లెల్లో చాపకింద నీరులా కార్గో వ్యతిరేక ఉద్యమం విస్తరిస్తోంది. పచ్చని తోటల్ని కొట్టివేయడం తమకు ఇష్టం లేదని అంటున్నారు రైతులు. కొందరైతే కాస్త డిఫరెంట్‌గా, ఇంకాస్త గట్టిగా తమ వాదన వినిపిస్తున్నారు. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఫ్యాక్టరీ లాంటిది ఏదైనా వస్తే... ఇష్టం లేకున్నా... భవిష్యత్ కోసం భూములు ఇస్తాంగానీ. కేవలం కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో పరిమితమైన ఉపాధి దక్కుతుందంటే అలాంటి ప్రయోజనం లేని త్యాగాలకు మేం సిద్ధంగా లేమని తెగేసి చెబుతున్నారు. పైగా మా భూమిని లాక్కుని భూ బ్యాంక్ సిద్ధం చేసుకుంటామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని అంటున్నారు. ఈ వ్యవహారం మొత్తం అటుచేరి ఇటు చేరి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషకు చుట్టుకుంటోందట. దశాబ్దాలుగా గౌతు ఫ్యామిలీకి అండగా నిలుస్తున్నారు ఇక్కడి ప్రజలు. సర్దార్ గౌతు లచ్చన్నకు ఉన్న పేరు గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు. ఆయన కుమారుడు గౌతు శివాజీ సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేయటంతో పాటు, మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. కానీ... శివాజీ కుమార్తె అయిన శిరీషకు రాజకీయ పరిణితి లోపించిందని, ప్రజల మనోగతాన్ని తెలుసుకోలేకపోతున్నారన్న మాటలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా వెళితే... వాళ్ళకు మంచి చేయాలనుకోవడం ఏమోగానీ... భవిష్యత్‌లో ఇబ్బందులు మాత్రం తప్పవంటూ టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులే హెచ్చరిస్తున్నారు. దీనిపై వైసీపీ కూడా ప్రశ్నాస్త్రాలు సంధిస్తోంది. మూలపేట పోర్ట్ దగ్గర వేలాది ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నప్పుడు దానికి దగ్గర్లోనే... ఇలా మరో భూ సేకరణ అవసరమా అన్నది ఫ్యాన్ క్వశ్చన్. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే కూడా ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్టు తెలుస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా... తమ ప్రాంతానికి వచ్చిన ప్రాజెక్ట్ విషయంలో అడుగు ముందుకేయాలా? లేక ప్రజాభీష్టం పేరుతో ఆపేయాలో అర్ధంగాక గందరగోళంలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

# అమరావతి కోసం వైసీపీ లీగల్ ఫైట్...



**విజయవాడ,జూన్ 8, పెన్ పవర్:**
అమరావతిలో రాజధాని నిర్మాణం ఒక ఎత్తయితే... అందుకోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యలు మరోఎత్తు. ఒకవైపు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే... ఇంకోవైపు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు, రెండో విడత భూ సమీకరణకు సంబంధించిన సమస్యలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. సరిగ్గా ఇక్కడే కొత్త అస్త్రాలకు పదును పెడుతోందట ప్రతిపక్ష పార్టీ. బాధిత రైతుల తరపున వైసీపీ డైరెక్ట్‌గా యాక్షన్‌లోకి దిగే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తోంది. దానికి సంబంధించి ఆగమేఘాల మీద పార్టీ తరపున ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడమే ఇందుకు ఉదాహరణ అంటున్నారు పరిశీలకులు. రాజధాని ప్రాంతానికి చెందిన కొందరు రైతులు తాజాగా వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను కలిశారు. వాళ్ళు తమ సమస్యల్ని చెప్పిన వెంటనే పార్టీ కమిటీలు ఏర్పాటవడం చూస్తుంటే... ఈ విషయలో విపక్షం ఎంత సీరియస్‌గా ఉందో అర్థమవుతోందని అంటున్నారు ఈ వ్యవహారాలను దగ్గరగా గమనిస్తున్న వాళ్ళు. అమరావతి రైతుల సమస్యల్ని క్షేత్రస్థాయి పరిశీలించడం కోసం పార్టీ తరపున కీలకమైన సీఆర్డీఏ కమిటీ ఏర్పాటైంది. బలవంతపు భూ సమీకరణకు తాము వ్యతిరేకమని.. తాము అధికారంలోకి వచ్చాక అవసరమైతే భూముల్ని తిరిగి ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తామని జగన్ చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ప్రభుత్వం చెబుతున్నట్టు అమరావతిలో అంతా పారదర్శకంగా ఏమీ లేదని, చాలా మందికి తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే వైసీపీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందని అంటున్నారు. 400 మందికి పైగా రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇంకా కేటాయించాల్సి ఉందని చెప్పుకుంటున్నారు. కొన్ని భూములపై కోర్టు కేసులు కొనసాగుతుండగా.. వాటి పరిష్కారం తర్వాతే ప్లాట్లు కేటాయిస్తామని అంటోందట ప్రభుత్వం. లంక భూములకు సంబంధించిన సమస్యలు కూడా ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని తెలుస్తోంది. రెండు వేలకుపైగా ప్లాట్లు వివిధ కోర్టు వివాదాల్లో ఉన్నాయనే చర్చ కూడా జరుగుతోంది. ఇలా అధికారికంగా వెలుగులోకి వచ్చిన సమస్యలతో పాటు.. బయటకు రాని ఇబ్బందులు కూడా చాలానే ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కోర్టులకు వెళ్లే స్థోమత లేక.. ప్రభుత్వాన్ని ఎదిరించే ధైర్యం చాలని చాలామంది రైతులు తమ సమస్యలను బయటపెట్టలేకపోతున్నారని వైసీపీ నేతలు గుర్తించినట్లు సమాచారం. అలాంటి వారికి అండగా ఉండి న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల వైసీపీ అధ్యక్షులు పేర్ని నాని, అంబటి రాంబాబులతో పాటు దేవినేని అవినాష్, లేళ్ళ అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, నందిగం సురేష్, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాల వజ్రబాబులకు
ఈ కీలక కమిటీలో చోటు కల్పించారు. కోర్టుల్లో పోరాడేందుకు పార్టీ లీగల్ సెల్ నుండి పొన్నవోలు సుధాకర రెడ్డి లాంటి వాళ్ళను కూడా రంగంలోకి దించారు. ఇప్పటివరకు రాజధాని విషయంలో అధికార కూటమి వాదనలే ఎక్కువగా వినిపించాయని, అందుకే రైతుల సమస్యల పేరుతో వైసీపీ ప్రత్యామ్నాయ వేదికను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. మొదటి విడతలో రిటర్నబుల్ ప్లాట్లు అందని రైతులు, రెండో విడత భూ సమీకరణలో సమస్యలు ఎదుర్కొంటున్న వాళ్ళు, కోర్టుల చుట్టూ తిరగలేని బాధితులు.. ఇలా అన్ని వర్గాల వాళ్ళను సపోర్ట్ చేయడమే ప్రతిపక్ష పార్టీ అజెండాగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో అమరావతి రైతులు ఏం కోరుకుంటే అది చేస్తాం.. బలవంతపు భూసేకరణ అనేదే ఉండదు.. అవసరమైతే భూములు వెనక్కు ఇస్తాం. ప్రస్తుతానికి మనం చేయగలిగింది న్యాయ పోరాటం
మాత్రమేనన్న జగన్ మాటల చుట్టూ గట్టి చర్చలే జరుగుతున్నాయి. ఇదే సమయంలో తమ మావిగన్ ప్రతిపాదన అయితే అమరావతి ప్రాంత రైతుల నుంచి మరోసారి భూములు తీసుకోవాల్సిన అవసరం ఉండదన్న వాదనను తెరపైకి తెస్తోంది వైసీపీ. మొత్తం మీద అమరావతి రైతుల సమస్యలను కేంద్రంగా చేసుకుని వైసీపీ లీగల్ అస్త్రంతో డైరెక్ట్ వార్ డిక్లేర్ చేసినట్టేనన్నది విస్తృతాభిప్రాయం. భూ సమీకరణ బాధితులకు అండగా నిలవడం ద్వారా రాజధాని పేరుతో ప్రభుత్వానికి వస్తున్న మైలేజీకి బ్రేకులు వేయాలన్నది విపక్షం స్కెచ్‌గా కనిపిస్తోంది. మరి ఈ లీగల్ ఫైట్‌కు రైతులు కలిసి వస్తారా...? కూటమి ప్రభుత్వం ఎలాంటి కౌంటర్ ఉంటుందోనన్న ఆసక్తి పెరుగుతోంది పొలిటికల్ సర్కిల్స్‌లో.

## రాజ్యసభ ఎన్నికల కోసం పక్కా వ్యూహం

**విజయవాడ,జూన్ 8, పెన్ పవర్:** ఏపీలో రాజ్యసభ లెక్క తేలింది. టిడిపి నుంచి ముగ్గురు.. జనసేన నుంచి ఒకరు ఖరారు అయ్యారు. టిడిపి నుంచి సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ పేరు ఖరారు చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు రాజ్యసభ ఎన్నికలో పక్కా వ్యూహం అమలు చేసినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణలు, ప్రాంతాలవారీగా బ్యాలెన్స్ చేయడం, పార్టీకి ఉన్న నమ్మకమైన కేడర్ కు ప్రాధాన్యత ఇవ్వడం అనే అంశాల ఆధారంగా ఈ ముగ్గురి ఎంపిక జరిగింది. కాపు బీసీ సామాజిక వర్గాలకు ప్రాధాన్యమిస్తూనే.. విద్యారంగంలో గుర్తింపు ఉన్న వ్యక్తులకు, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన యువనాయకత్వానికి ఈసారి పెద్దపీట వేశారు. బిజెపి, జనసేన నాయకత్వంతో మాట్లాడిన తర్వాత మాత్రమే తుది నిర్ణయం తీసుకున్నారు. ముగ్గురు ఎంపిక వెనుక పార్టీ పట్ల విధేయత దాగి ఉంది. ముఖ్యంగా ముగ్గురు నారా లోకేష్ కు అత్యంత సన్నిహితులు కావడం విశేషంసానా సతీష్ కు మరోసారి కొనసాగింపు లభించింది. గత కొంతకాలంగా పార్టీలో ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. పారిశ్రామిక వ్యాప్తంగా కూడా గుర్తింపు ఉంది. నిత్యం నారా లోకేష్ వెంట ఉండేవారు. ఆయన పాదయాత్ర చేసిన సమయంలో కూడా కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. భాష్యం రామకృష్ణ తెర వెనుక రాజకీయ సేవలు అందిస్తూ వచ్చారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా సహకారం అందించారు. మొన్నటి ఎన్నికల్లో గుంటూరు ఎంపీ టికెట్ ఆశించారు. కానీ వీలు పడలేదు. రాజ్యసభ పదవి దక్కింది. ఇక చింతకాయల విజయ్ గురించి చెప్పనవసరం లేదు. తండ్రి మాదిరిగానే దూకుడు కలిగిన నేత. ఐటీడీపీకి విశేష సేవలు అందించారు. ఆయనకు రాజ్యసభ పదవి ఇవ్వడం ద్వారా యువతకు, పార్టీ నమ్మకస్తులకు చంద్రబాబు సరైన గుర్తింపు ఇచ్చారని చర్చ జరుగుతోందిఈ ముగ్గురి ఎంపిక వెనుక ఉన్న అసలు వ్యూహం లోకేష్. పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. మొన్న పొలిట్ బ్యూరోతో పాటు అన్ని రకాల కార్యవర్గాల్లో యువతను నియమించారు. ఇప్పుడు రాజ్యసభలో సైతం ఈ ముగ్గురు యువ నాయకులను తీసుకున్నారు. పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ కీలక నియామకం చేపట్టారు. ఉత్తరాంధ్ర నుంచి విజయ్ ను తీసుకోవడం విశేషం. బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం, యువనేత కావడంతో చివరి నిమిషంలో ఆయన వైపు మొగ్గు చూపారు చంద్రబాబు. మొత్తానికి అయితే సుదీర్ఘ కసరత్తు తరువాత చంద్రబాబు రాజ్యసభ సభ్యులను ఎంపిక చేయడం విశేషం.

## కర్నూలులో వైసీపీ వర్సెస్ వైసీపీ

**కర్నూలు,జూన్ 8, పెన్ పవర్:** కర్నూలులో అధికార పార్టీ, ప్రతిపక్షం పోరు కాస్త..వైసీపీ వర్సెస్ వైసీపీ అన్నట్టు మారిపోయింది. టీడీపీలోని ఒక వర్గం పరోక్షంగా ప్రతిపక్ష నేతల మధ్య మంట పెట్టిందనే ప్రచారం జరుగుతున్న వేళ..కర్నూలు వైసీపీలో అంతర్గత పోరు వీధికెక్కుతోంది. ఏకంగా సోషల్ మీడియా వేదికగా నాయకులు దుమ్మెత్తి పోసుకోవడం హాట్ టాపిక్ అవుతుంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, వైసీపీ కర్నూలు నగర అధ్యక్షుడు అహ్మద్ అలీ ఖాన్ మధ్య సోషల్ మీడియా వార్ ఒక రేంజ్‌లో నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లోనూ కర్నూలు సీటు మైనారిటీకి వెళ్తుందని ఎస్వీ మోహన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని.. టీడీపీ కన్న వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ వర్గం తనపై కక్ష కట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు అహ్మద్ ఖాన్వారం పది రోజుల క్రితం కర్నూలు వేదికగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎస్వీ మోహన్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మధ్య మాటలు మంటలు చెలరేగాయి. అవి అలా చల్లారాయో లేదో ఇప్పుడు వైసీపీలో అంతర్గత పోరు కాక రేపుతోంది. పార్టీ కర్నూలు నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడితో, ఎస్వీ మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా ఫోన్‌లో మాట్లాడిన మాటలు ఇప్పుడు బయటికి వచ్చాయి. వాయిస్ రికార్డ్ చేసిన ఐటీడీపీ ప్రతినిధి దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అంతకు ముందు కర్నూలులో ఎస్వీ మోహన్ రెడ్డి, జక్కంపూడి రాజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేసిన ఆందోళన విషయంలో కూడా అహ్మద్ ఖాన్ ఎస్వీకి వ్యతిరేకంగా కామెంట్స్ చేశారు. ఆయన వైసీపీలో వెనుకబడ్డారని, దాన్ని నిలబెట్టుకోడానికి నానా తంటాలు పడుతున్నాడని అహ్మద్ ఖాన్ అన్నట్లుగా చెబుతున్నారు. కర్నూలులో వైసీపీ చేపట్టిన ఆందోళనలో జక్కంపూడి రాజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాత్రమే హైలైట్ అయ్యారంటూ ఐటీడీపీ ప్రతినిధితో ఫోన్ కన్వర్జేషన్‌లో మాట్లాడారు వైసీపీ నగర అధ్యక్షుడు అహ్మద్ ఖాన్. ఎస్వీ మోహన్ రెడ్డి వన్ మ్యాన్ షో చేస్తున్నారంటూ సొంత పార్టీ నేతపై నెగెటివ్ కామెంట్స్ చేశారాయన. సరిగ్గా ఈ పాయింట్స్‌నే తమకు అనుకూలంగా మల్చుకునేందుకు టీడీపీ వ్యూహాలు రచిస్తోంది. వైసీపీలో అంతర్గత విభేదాలు గట్టిగా ఉన్నాయని ప్రొజెక్ట్ చేస్తూ..ఆడియో రికార్డ్‌ను పోస్ట్ చేసింది టీడీపీ సోషల్ మీడియా టీమ్. ఇదే ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలో మంటలు పుట్టిస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడికి వ్యతిరేకంగా కర్నూల్ నగర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలతో క్యాడర్లో అయోమయ పరిస్థితి ఏర్పడింది. అటు ఎస్వీకి చెందిన సోషల్ మీడియా టీమ్ కూడా అహ్మద్ అలీఖాన్ పేరు ప్రస్తావించకుండా కొన్ని పోస్టులు పెట్టడం కలకలం రేపుతోంది. మరికొందరు సోషల్ మీడియాలోనే అహ్మద్ అలీఖాన్‌ను నిలదీస్తున్నారు.కర్నూలు వైసీపీలో ముగ్గురు కీలక నేతలు యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్ రెడ్డి, హఫీజ్ ఖాన్, నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ మూడు గ్రూప్‌లు విడిపోయి యాక్టివిటీ నడిపిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్ళు హఫీజ్ ఖాన్, ఎస్వీ మోహన్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా పోరు మాత్రం ఆగడం లేదు. అది చాలదన్నట్లుగా అహ్మద్ ఖాన్ వాయిస్ రేజ్ చేయడంతో పాటు ఆయన ఆడియో కాల్ టీడీపీ సోషల్ మీడియా టీమ్‌కు చిక్కడం మరింత చర్చనీయాంశంగా మారింది. రాయలసీమకు ముఖద్వారంగా ఉన్నా కర్నూలు వైసీపీలో నడుస్తున్న అంతర్గత పోరుపై పార్టీ అధిష్టానం ఎలా రియాక్ట్ అవుతుందో వేచి చూడాలి మరి.

## సైలెంట్ మూడ్ లోకి ఫైర్ బ్రాండ్లు

**కడప,జూన్ 8, పెన్ పవర్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒక వింత వాతావరణం కొనసాగుతోంది. ఎవరి వల్ల పార్టీకి చెడ్డ పేరు వచ్చిందో.. వారు ఇప్పుడు యాక్టివ్ అవుతున్నారు. పార్టీలో సీనియర్లు సైలెంట్ అవుతున్నారు. ఈ భిన్న వాతావరణంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. 2019 నుంచి 2024 మధ్య కొంతమంది నేతల వ్యవహార శైలితోనే పార్టీకి ఈ రకమైన ఇబ్బందులు వచ్చాయి. ప్రారంభంలో వారి మాటలు గొప్ప ఫ్యాషన్ గా అనిపించాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సైతం ఆకర్షించాయి. కానీ రాను రాను ఆ నేతల తీరుతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పతనస్థితికి చేరుకుందనేది పార్టీ క్యాడర్ కు తెలిసింది. పార్టీలో సీనియర్లు మౌనం వహించి.. దూకుడు కలిగిన నేతలు మాటలు పార్టీకి చేటు తెచ్చాయి అని ఆలస్యంగా తెలిసింది. అప్పటికే మూల్యం చెల్లించుకుంది పార్టీ. అయితే ఇప్పుడు క్యాడర్ తెలుస్తుంది కానీ.. నాయకత్వం తెలుసుకోకపోవడం పార్టీకి లోటు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్లుగా గుర్తింపు సాధించారు కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్, పేర్ని నాని, అంబటి రాంబాబు, ఆర్కే రోజా, జోగి రమేష్, గుడివాడ అమర్నాథ్, సిదిరి అప్పలరాజు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది జూనియర్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడే వారు. వారి మాటలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎంతో ఇష్టంగా ఉండేవి. అయితే వారి మాటలు తటస్థులతోపాటు విద్యాధికులపై విపరీతంగా ప్రభావం చూపించాయి. దాని ఫలితమే 2024 ఎన్నికల్లో దారుణ పరాజయంవైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేటు తెచ్చిన ఆ దూకుడు నేతలను జగన్మోహన్ రెడ్డి పక్కన పెట్టినట్లు కనిపించారు ప్రారంభంలో. గత అనుభవాల దృష్ట్యా సీనియర్ల సేవలను వినియోగించుకుంటానని జగన్ చెప్పుకొచ్చారు. అందుకు తగ్గట్టుగానే సీనియర్లుగా ఉన్న ధర్మాన, బొత్స లాంటి నేతలు మాట్లాడడం ప్రారంభించారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని అంతా భావించారు. కానీ ఆ సరదా ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. ఎవరైతే బూతులు మాట్లాడారో.. అడ్డగోలుగా వ్యవహరించారో.. అటువంటి నేతలు మళ్లీ తెరపైకి వస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి వారికి ప్రాధాన్యమిస్తున్నట్టు కనిపిస్తున్నారు. దీంతో సీనియర్లుగా ఉన్న ధర్మాన లాంటి వారు మళ్లీ మౌనం పాటిస్తున్నారు. ఇలా అయితే కష్టమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిట్టూరుస్తున్నారు.

## దేవీపట్నం మండలంలో కొనసాగుతున్న పులి సంచారం

**ఏలూరు: పెన్ పవర్:** దేవీపట్నం మండలం నెలకోట ఒ పూడిపల్లి సొరంగం వద్ద పులి సంచారం కొనసాగుతోంది. అటవీశాఖ, హనుమాన్ ప్రత్యేక బృందాలు రాత్రంతా నిఘా కొనసాగించాయి. క్షేత్రస్థాయిలో బృందాలకు ఉన్నతాధికారులు మార్గనిర్దేశం చేస్తున్నారు. లి బెంగళూరు నుంచి వచ్చిన వన్యప్రాణి నిపుణుల బృందం ఆపరేషన్ లో భాగస్వామ్యమైయింది. రాత్రివేళ బయటకు ఒంటరిగా వెళ్లొద్దని గ్రామస్తులకు అటవీశాఖ అధికారులు సూచించారు.

## విశాఖలో యువకుడి దారుణ హత్య

**విశాఖపట్నం: పెన్ పవర్:** విశాఖపట్నం మురళీ నగర్ మసీదు సెంటర్ సమీపంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నడిరోడ్డుపై కత్తులతో దాడి జరిగింది. బాధితుడు కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాత కక్షల నేపద్యంలో సాలిపేటకు చెందిన వరుణ్ ( 35 ) హత్య కు గురైయాడు. నిందితులు పరారీలో వున్నారు. పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్ఆరు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## దళపతి 'చెక్ మేట్' : వరల్డ్ ఛాంపియన్‌తో
# తలపడ్డ సీఎం విజయ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయ చదరంగంలో విజేతగా నిలిచిన తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నిజమైన చెస్ బోర్డుపైనా పావులు చురుగ్గా కదిపారు. ప్రపంచ ఛాంపయన్ ప్రజ్ఞానందకు చెక్ చెప్పే ప్రయత్నం చేసి అబ్బురపరిచారు. ఒకవైపు సీఎం విజయ్, మరోవైపు వరల్డ్ ఛాంపియన్ ప్రజ్ఞానంద మధ్య ఎత్తులకు పైఎత్తులతో సాగిన పోరు ఆసక్తి రేపింది. సరదాగా సాగిన ఇద్దరు విజేతల మధ్య చదరంగం సరికొత్త మజాను అందించింది. అంతర్జాతీయ వేదికపై భారతదేశ కీర్తి పతాకాన్ని ఎగురవేసిన యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానందను సీఎం విజయ్ చెన్నైలోని సచివాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ప్రజాజనందతో కాసేపు చెస్ ఆడిన సీఎం విజయ్ తనలోని ప్రతిభను చాటుకున్నారు.

**రూ. 50 లక్షల నజరానా**

ప్రతిష్టాత్మక 'నార్వే చెస్ 2026' సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో చారిత్రాత్మక విజయం సాధించిన ప్రజ్ఞానందను అభినందిస్తూ, తమిళనాడు ప్రభుత్వం తరఫున రూ. 50 లక్షల నగదు బహుమతిని సీఎం విజయ్ అందజేశారు. కేవలం అధికారిక సత్కారానికే పరిమితం కాకుండా, దళపతి విజయ్ యువ గ్రాండ్‌మాస్టర్‌తో కాసేపు సరదాగా చెస్ ఆడారు. బోర్డుపై పావులను కదుపుతూ ప్రజ్ఞానందకు గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి, ప్రపంచ స్థాయి చెస్ ప్లేయర్ తలపడిన ఈ అరుదైన దృశ్యం ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దళపతి స్టైలిష్ లుక్, చెస్ బోర్డు వైపు ఆయన సీరియస్‌గా చూస్తున్న ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

**చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద**

ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లు తలపడే నార్వే చెస్ టోర్నీలో ప్రజ్ఞానంద సాధించిన విజయం సామాన్యమైనది కాదని అంటున్నారు. ప్రపంచ ఛాంపియన్లను, టాప్ సీడెడ్ ఆటగాళ్లను తన మేధస్సుతో మట్టికరిపించి, ఈ ప్రతిష్టాత్మక టైటిల్‌ను కైవసం చేసుకున్న తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద సరికొత్త రికార్డును లిఖించాడు. క్లిష్టమైన సమయాల్లోనూ ఏమాత్రం ఒత్తిడికి లోనవకుండా ప్రజ్ఞానంద ప్రదర్శించిన వ్యూహాలు అంతర్జాతీయ చెస్ వర్గాలను సైతం అబ్బురపరిచాయి. ఈ అద్భుత విజయంతో భారతదేశంతో పాటు తమిళనాడు ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసినందుకు సీఎం విజయ్ ప్రజ్ఞానందను అభినందించారు.

**క్రీడలకు దళపతి అండ!**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ.. ప్రజ్ఞానంద విజయం దేశంలోని లక్షలాది మంది యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరిన్ని అంతర్జాతీయ వేదికలపై రాణించేలా ప్రభుత్వం తరఫున పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల కల్పనకు, యువ ప్రతిభను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ భేటీలో ప్రజ్ఞానంద కుటుంబ సభ్యులతో పాటు క్రీడా శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

## వైట్‌హౌస్ టు వైర్లెస్: మైక్ విసిరేసి "థాంక్యూ డార్లింగ్" అన్న
# ట్రంప్.. సోషల్ మీడియాలో మీమ్స్ జాతర!



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంటేనే ఒక అన్‌ప్రెడిక్టబుల్ ప్యాకేజీ. ఆయన ఎప్పుడు ఎవరిపై ప్రేమ కురిపిస్తారో.. ఎప్పుడు ఎవరి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తారో ప్రెసిడెంట్ గారి 'మూడ్ స్వింగ్స్' కనిపెట్టే సాఫ్ట్‌వేర్ ఇంకా సిలికాన్ వ్యాలీలో కూడా తయారవ్వలేదు. అందుకే వైట్‌హౌస్ వర్గాల్లో ఆయన్ను ఒక 'లైవ్ వైర్' లాగా చూస్తుంటారు. టచ్ చేస్తే చాలు.. షాక్ కొట్టడం ఖాయం. తాజాగా ఒక టీవీ ఇంటర్వ్యూలో ట్రంప్ ప్రదర్శించిన విశ్వరూపం చూశాక ఇప్పుడు అమెరికన్లంతా ముక్కున వేలేసుకుంటున్నారు.

**కథేంటంటే.. ప్రెసిడెంట్ గారికి ప్రెజర్ పెరిగింది!**

ప్రముఖ అంతర్జాతీయ ఛానల్ 'ఎన్‌బీసీ' ప్రతినిధి క్రిస్టెన్ వెల్కర్ 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో భాగంగా ట్రంప్ గారిని ఇంటర్వ్యూ చేయడానికి కూర్చున్నారు. అంతా బాగానే సాగుతోంది అనుకునేలోపు చర్చ కాలిఫోర్నియా ఎన్నికల వైపు మళ్లింది. ఇంకేముంది.. అక్కడ భారీ ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ట్రంప్ తనదైన శైలిలో ఆరోపణల సునామీ మొదలుపెట్టారు. సరే జర్నలిస్ట్ అన్నాక కనీస ధర్మం పాటించాలి కదా.. "అంత పెద్ద మాట అంటున్నారు.. ఏమైనా ఆధారాలు ఉన్నాయా సార్?" అని క్రిస్టెన్ చాలా మర్యాదగా అడిగారు. ఇక్కడే ట్రంప్ సహనానికి 'టోల్ గేట్' పడిపోయింది. ఒకసారి అడిగితే ఓపిక పట్టారు.. కానీ సదరు యాంకర్ వదలకుండా పదేపదే "ప్రూఫ్స్ ఏవి? ప్రూఫ్స్ ఏవి?" అని అడిగేసరికి.. ట్రంప్ ముఖంలో ఉన్న కాస్త నవ్వు మాయమై, హాలీవుడ్ విలన్ రేంజ్ ఆగ్రహం ఎంట్రీ ఇచ్చింది.

**మైక్ నేలకు.. 'డార్లింగ్' గాల్లోకి!**

"నువ్వు పనికిమాలిన వ్యక్తివి.. మీ మీడియా మొత్తం అవినీతిమయం.. ఈ మీట్ ది ప్రెస్ అనేది ఒక మోసపూరిత షో!" అంటూ ట్రంప్ ఒక్కసారిగా ఫైర్ అయ్యారు. అంతటితో ఆగితే ఆయన ట్రంప్ ఎందుకు అవుతారు? చేతిలో ఉన్న మైక్‌ను తీసి 'ఛటాల్న' నేలకేసి కొట్టారు. ఆ దెబ్బకు అక్కడ ఉన్నవారంతా గుండె ఆగినంత పనిచేశారు. అయితే అసలైన ట్విస్ట్ ఇక్కడే ఉంది. అంత ఘోరంగా మైక్ విసిరేసి వెళ్లబోతూ యాంకర్ వైపు చూసి చాలా కూల్‌గా "ఇక ఇక్కడితో ఆపేద్దాం... థాంక్యూ డార్లింగ్!" అంటూ ఫ్లయింగ్ కిస్ రేంజ్‌లో సైన్ ఇచ్చి అక్కడి నుంచి వాకౌట్ చేశారు. ఇప్పుడు అమెరికా జనాభా అంతా ఇదే కన్ఫ్యూజన్‌లో ఉంది. మైక్ విసిరేయడం కోపానికి పరాకాష్ట అయితే.. 'థాంక్యూ డార్లింగ్' అనడం దేనికి సంకేతం? ఇది కోపమా, ప్రేమా లేక ట్రంప్ మార్కు 'స్పెషల్ ప్యాకేజీ'నా అని బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు.


**సోషల్ మీడియాలో సెటైర్ల వర్షం.. మైక్ కంపెనీల పండగ!**

ఈ ఘటనపై విమర్శకులు ఘాటుగానే స్పందిస్తున్నారు. "ఒకప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గంటల తరబడి ప్రెస్ మీట్లు పెట్టి మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు అధ్యక్ష పీఠం ఎక్కాక ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం మానేసి, ప్రశ్నించే వారిపైనే దాడులు చేస్తున్నారు" అంటూ మండిపడుతున్నారు. కానీ సోషల్ మీడియా జనాలు మాత్రం ఈ ఇష్యూని ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రస్తుతం నెట్టింట హల్ చల్ చేస్తున్న కొన్ని క్రేజీ కామెంట్లు మీమ్స్ వైరల్ అవుతున్నాయి. ఇకపై ట్రంప్ ఇంటర్వ్యూలు బుక్ చేసుకునే టీవీ ఛానళ్లు.. ముందుగా తమ మైక్‌లకు, కెమెరాలకు 'ట్రంప్ స్పెషల్ ఇన్సూరెన్స్' చేయించుకోవడం ఉత్తమం అంటూ ఎద్దేవా చేస్తున్నారు. మార్కెట్లోకి కొత్తగా "నోకియా 3310" లాంటి ఒక మైక్ మోడల్‌ను తీసుకురావాలని కంపెనీలు ప్లాన్ చేస్తున్నాయట. "అమెరికా ప్రెసిడెంట్ చేతిలో పడినా పగలని ఏకైక మైక్!" అంటూ వాళ్లు ప్రమోట్ చేసుకోవచ్చు. "ట్రంప్‌ను ఇంటర్వ్యూ చేయడం అంటే.. ప్రాణాలకు మాత్రమే కాదు.. ఎలక్ట్రానిక్ వస్తువులకు కూడా తీవ్రమైన రిస్క్ అని తేలిపోయింది!" నెటిజన్ల పంచ్ లు వేస్తున్నారు. మొత్తానికి వైట్‌హౌస్ రేస్ ముగిసినా ట్రంప్ ఇచ్చే ఎంటర్టైన్‌మెంట్‌కు మాత్రం ఎండ్ కార్డ్ పడటం లేదు. 'థాంక్యూ డార్లింగ్' అనే డైలాగ్ ఇప్పుడు గ్లోబల్ ట్రెండింగ్ మీమ్ మెటీరియల్‌గా మారిపోయింది!

# రోడ్ డాక్టర్ : గుంతల సమస్యకు 20 నిమిషాల్లో శాశ్వత పరిష్కారం!

**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా రోడ్డు మరమ్మతులు అంటే తారును భారీగా వేడి చేయడం, రోడ్లను తవ్వడం, ట్రాఫిక్‌ను గంటల తరబడి నిలిపివేయడం వంటి సమస్యలు ఉంటాయి. కానీ ఈ 'రోడ్ డాక్టర్' మెషీన్‌తో అలాంటి ఇబ్బందులు ఏమీ ఉండవు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధ్వాన్నంగా మారిన రహదారుల మరమ్మతులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రోడ్లపై గుంతల కారణంగా వాహనదారులు పడుతున్న ఇబ్బందులకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సరికొత్తగా 'రోడ్ డాక్టర్' టెక్నాలజీని ప్రవేశపెడుతోందని చెబుతున్నారు. రహదారుల నిర్వహణను మరింత వేగవంతంగా, పర్యావరణహితంగా మార్చేందుకు మొబైల్ ఇన్ఫ్రారెడ్ మిషన్లను వినియోగించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా రోడ్డు మరమ్మతులు అంటే తారును భారీగా వేడి చేయడం, రోడ్లను తవ్వడం, ట్రాఫిక్‌ను గంటల తరబడి నిలిపివేయడం వంటి సమస్యలు ఉంటాయి. కానీ ఈ 'రోడ్ డాక్టర్' మెషీన్‌తో అలాంటి ఇబ్బందులు ఏమీ ఉండవు అంటున్నారు. అధునాతన ఇన్ఫ్రారెడ్ టెక్నాలజీతో రోడ్లను మరమ్మతు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇన్ఫ్రారెడ్ హీటింగ్ వ్యవస్థతో పనిచేసే ఈ టెక్నాలజీని వాడి గుంత పడిన ప్రాంతాన్ని వేడి చేసి, అక్కడికక్కడే రాళ్లు, తారు మిశ్రమాన్ని తయారు చేసి గుంతల్లో నింపుతారని చెబుతున్నారు. దీంతో కేవలం 15 నుండి 20 నిమిషాల వ్యవధిలోనే గుంతలను పూడ్చేయొచ్చని అంటున్నారు. ఒక పెద్ద గుంతను పూర్తిగా పూడ్చి, రోడ్డును సాధారణ స్థితికి తీసుకురావడానికి పెద్దగా సమయం అవసరం లేదని నిపుణులు చెబుతుండటంతో ప్రభుత్వం ఈ టెక్నాలజీపై ఆసక్తి చూపుతోందని అంటున్నారు.

అదేవిధంగా ఒక డ్రైవర్, నలుగురు కార్మికులతోనే ఈ వాహనాన్ని ఆపరేట్ చేయవచ్చునని అంటున్నారు. దీనివల్ల శ్రమ, సమయం భారీగా ఆదా అవుతాయని చెబుతున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల మున్సిపల్ కార్పొరేషన్లు ఇప్పటికే ఈ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయ. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్



సుమారు రూ.1.48 కోట్ల వ్యయంతో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ఈ అధునాతన ఇన్ఫ్రారెడ్ రోడ్డు మరమ్మతు వాహనాన్ని కొనుగోలు చేసి ప్రారంభించినట్లు చెబుతున్నారు. అదేవిధంగా గుంటూరులో కూడా రూ. 1.50 కోట్ల వ్యయంతో ఈ వాహనాన్ని వినియోగిస్తున్నారని సమాచారం. ఇది రోజుకు 10 నుంచి 15 ప్రధాన గుంతలను సునాయాసంగా పూడ్చేస్తోందని అంటున్నారు.గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కూడా ఈ 'రోడ్ డాక్టర్' మెషీన్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. వర్షాకాలంలో త్వరితగతిన రోడ్లను బాగు చేయడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. సాంప్రదాయ పద్ధతుల్లో రోడ్లు వేసేటప్పుడు వెలువడే దట్టమైన పొగ కారణంగా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుంది. అయితే నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ నివేదికల ప్రకారం, ఈ ఇన్ఫ్రారెడ్ టెక్నాలజీ ఆధారిత రోడ్ డాక్టర్ మిషన్లను వాడటం వల్ల కార్బన్ ఉద్గారాలు దాదాపు 98 శాతం వరకు తగ్గుతాయని అంటున్నారు.

ఇక రోడ్ల మరమ్మతులను ట్రాక్ చేయడానికి ప్రభుత్వం డాష్‌క్యామ్ సర్వే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని కూడా జోడిస్తోందని

అంటున్నారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ గుంతలు ఉన్నాయో గుర్తించి, వాటిని వెంటనే ఈ 'రోడ్ డాక్టర్' మిషన్ల ద్వారా సరిచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏపీని గుంతలు లేని రాష్ట్రంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పంలో ఈ 'రోడ్ డాక్టర్' ఒక విప్లవాత్మక అడుగు కానుందని అంటున్నారు. తక్కువ ఖర్చుతో, అత్యంత వేగంగా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా రోడ్లను బాగు చేసే ఈ టెక్నాలజీ రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన రహదారులపై అందుబాటులోకి రానుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# టీడీపీలో హాట్ టాపిక్ గా మంగళగిరి మోడల్.. తమ్ముళ్లకు టార్గెట్ సెట్ చేసిన లోకేశ్

**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి మోడల్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. ఆ నియోజకవర్గంలో మంత్రి లోకేశ్ పనితీరు, రాజకీయ వ్యూహాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించడం చర్చనీయాంశంగా మారింది. సాక్ష్యాత్తూ అధినేత చంద్రబాబును ఆకర్షించిన మంగళగిరి మోడల్ ఏంటి? దానిని అందుకోవడం మిగిలిన ఎమ్మెల్యేలు, మంత్రులకు ఎందుకు సాధ్యం కావడం లేదన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. 2019 ఎన్నికల్లో పోటి చేసిన తొలిసారి ఓటమి ఎదుర్కొన్న మంత్రి లోకేశ్ ఐదేళ్లలో నియోజకవర్గాన్ని పటిష్టమైన కోటలా తీర్చిదిద్దుకున్న తీరు.. ఆ తర్వాత నియోజకవర్గ వాసులతో ఆయన పెంచుకున్న సంబంధాలు అధినేత చంద్రబాబును ఆకట్టుకుందని అంటున్నారు.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసిన నారా లోకేష్ స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలైన విషయం తెలిసిందే. సాధారణంగా లోకేశ్ స్థాయి నాయకులు ఓడిపోతే తర్వాత ఎన్నికల నాటికి సురక్షిత స్థానాన్ని ఎంచుకుంటారు. ఓడిన నియోజకవర్గాన్ని పక్కన పెట్టేస్తారని భావిస్తారు. కానీ, మంత్రి లోకేశ్ అందరిలా ఆలోచించలేదు. టీడీపీ చరిత్రలో ఎప్పుడు గొప్పవిజయాలు సాధించని మంగళగిరిని ఒక ప్రయోగశాలగా మార్చుకున్నారని చెబుతున్నారు. తన ఓటమిని సవాల్‌గా తీసుకుని మంగళగిరిలోనే మకాం వేశారు. 2024 ఎన్నికల కంటే ముందే నియోజకవర్గంలోని ప్రతి ఇంటినీ పలకరించారు. 'యువగళం' పాదయాత్రకు ముందే మంగళగిరి సందు సందుల్లో తిరిగారు. ఫలితంగా 2024 లో ఊహించని రీతిలో భారీ మెజారిటీతో విజయం సాధించి, అసెంబ్లీలో అడుగుపెట్టారు.

**ఒక వ్యవస్థగా మార్పు**

మంత్రిగా ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, విద్యాశాఖ వంటి అత్యంత కీలకమైన బాధ్యతలు చూస్తూ సచివాలయంలో బిజీగా ఉంటున్నప్పటికీ, మంగళగిరిని ఆయన ఏమాత్రం




విస్మరించడం లేదు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి, స్థానిక అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక అధికారిక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ ఆడంబరాలకు దూరంగా ఉంటూ, క్షేత్రస్థాయిలో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయడం, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం వంటి చర్యలతో ప్రజల్లో మన లీడర్ అనే బలమైన ముద్ర వేశారని చెబుతున్నారు. ఇటీవలే మంగళగిరి లైబ్రరీలో సమ్మర్ నాలెడ్జ్ క్యాంప్ ప్రారంభించడం, నులకపేటలో కమ్యూనిటీ హాల్స్, ఆధునిక స్మశాన వాటికల అభివృద్ధి వంటి క్షేత్రస్థాయి పనులు ఆయన నిరంతర పర్యవేక్షణకు అద్దం పడుతున్నాయని అంటున్నారు.

**టీడీపీ ఎమ్మెల్యేలకు సవాల్**

మంత్రి నారా లోకేష్ మంగళగిరిని తీర్చిదిద్దుతున్న విధానం, టెక్నాలజీని వాడుకుంటూ సోషల్ మీడియా ద్వారా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండటం ఇప్పుడు మిగిలిన టీడీపీ ఎమ్మెల్యేలకు ఒక బెంచ్‌మార్క్‌గా మారిందని అంటున్నారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా లోకేశ్ ను ఫాలో అవ్వాలని చెబుతున్నారు. అయితే, ఈ వేగాన్ని అందుకోవడంలో కొందరు సొంత పార్టీ ఎమ్మెల్యేలు వెనుకబడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు పాత తరం రాజకీయాలకే పరిమితమవగా, అధిష్టానం మాత్రం లోకేష్ తరహాలోనే ప్రతి ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో పట్టు సాధించాలని, నిరంతరం ప్రజల్లో ఉండాలని స్పష్టమైన సంకేతాలు పంపుతోంది. ఇక నాయకత్వం అంటే కేవలం పదవులు అనుభవించడం కాదు.. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం అని లోకేష్ మంగళగిరి ద్వారా నిరూపించారని ప్రశంసలు అందుకుంటున్నారు. 2029 లక్ష్యంగా సాగుతున్న ఏపీ రాజకీయాల్లో, మంగళగిరి మోడల్ ఎలాంటి మార్పులు తీసుకువస్తుందో, మిగిలిన ప్రజాప్రతినిధులు ఈ వేగాన్ని ఎలా అందుకుంటారో చూడాల్సివుందని అంటున్నారు.

# రూ.10 కోట్ల కల.. ఎన్నారై జీవితాల అసలు వాస్తవం ఇదేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** విదేశాలకు వెళ్లే చాలా మంది భారతీయుల మనసులో ఒకే లక్ష్యం ఉంటుంది. కొన్నేళ్లు కష్టపడి పనిచేయాలి, మంచి మొత్తంలో డబ్బు సంపాదించాలి, ఆ తర్వాత భారత్‌కు తిరిగి వచ్చి స్థిరపడాలి. ఈ కలలో ఎక్కువగా వినిపించే సంఖ్య రూ.10 కోట్లు. కొందరికి అది తక్కువ కావొచ్చు, మరికొందరికి ఎక్కువ కావొచ్చు. కానీ "కొంత సంపాదించి తిరిగి స్వదేశానికి వస్తాం" అనే ఆలోచన మాత్రం దాదాపు అందరిలోనూ కనిపిస్తుంది. అయితే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో దశాబ్దాలుగా స్థిరపడిన భారతీయుల జీవితాలను పరిశీలిస్తే మరో వాస్తవం బయటపడుతుంది. విదేశాలకు వెళ్లిన వారిలో చాలా మంది శాశ్వతంగా భారత్‌కు తిరిగి రారు. ఇటీవల అమెరికాలో నివసిస్తున్న ఓ భారతీయ మహిళ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె చెప్పిన విషయాలు ఈ చర్చను మళ్లీ తెరపైకి తీసుకొచ్చాయి. ఆమె అభిప్రాయం ప్రకారం, విదేశాల్లో ఉండిపోయే కారణం కేవలం డబ్బు కాదు. కాలక్రమేణా వారి జీవనశైలి, ప్రాధాన్యతలు, మంచి జీవితంపై ఉన్న నిర్వచనం మారిపోతుంది. డాలర్లలో ఆదాయం రావడంతో

ఆర్థిక భద్రత పెరుగుతుంది. భారత్‌లోని కుటుంబాలకు నెలకు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు పంపించడం కూడా చాలా మందికి సాధారణ విషయంగా మారుతుంది. ఒకప్పుడు దూరంగా కనిపించిన ఆర్థిక లక్ష్యాలు త్వరగా చేరువ అవుతాయి. అయితే అసలు ప్రశ్న ఏమిటంటే.. లక్ష్యాన్ని చేరుకున్న తర్వాత కూడా ఎందుకు చాలామంది తిరిగి రావడం లేదు? కారణం ఒక్కటే. వలస జీవితం క్రమంగా ఆర్థిక నిర్ణయం నుంచి జీవన విధానంగా మారిపోతుంది. ఉద్యోగాల్లో ఎదుగుదల, స్నేహితుల వలయం, స్థానిక సమాజంతో అనుబంధం, పిల్లల చదువులు, భవిష్యత్తు అవకాశాలు వంటి అంశాలు వారిని అక్కడే నిలబెడతాయి.

ముఖ్యంగా పిల్లలు ఉన్న కుటుంబాల్లో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. మంచి విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలు, భద్రత వంటి అంశాలు తల్లిదండ్రులను ఆకర్షిస్తాయి. మరోవైపు భారత్ కూడా గత రెండు దశాబ్దాల్లో గణనీయంగా అభివృద్ధి చెందింది. మంచి జీతాలు, కొత్త అవకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాలు కారణంగా కొందరు తిరిగి స్వదేశానికి వస్తున్నారు.

అయితే అందరికీ వర్తించే ఒకే సమాధానం లేదు. కొందరు విదేశాలనే తమ శాశ్వత నివాసంగా మార్చుకుంటారు. మరికొందరు సరైన సమయం కోసం ఎదురుచూస్తూనే ఉంటారు. ఇంకొందరు రెండు దేశాల మధ్యే తమ జీవితాన్ని కొనసాగిస్తారు.చివరికి ఈ చర్చ డబ్బుతో ప్రారంభమైనా, అనుబంధాలు, కుటుంబం, జీవనశైలి, భవిష్యత్తు వంటి అంశాల దగ్గర ముగుస్తుంది. ఎందుకంటే సంపదను కూడబెట్టడం కంటే మనిషి వేర్లు పాతుకుపోయిన చోటు నుంచి మళ్లీ మారడం చాలా కష్టమని ఎన్నారై జీవితాలు చెబుతున్నాయి.

# పండ్లలో రారాజు.. ఆరోగ్యానికి కూడా మహారాజే!

**మామిడితో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు**

**రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్ ఎ, సి పుష్కలం**

**జీర్ణవ్యవస్థను మెరుగుపరిచే ఫైబర్, సహజ ఎంజైమ్‌లు**

**గుండె, చర్మం, కళ్ల ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు**



వేసవి వచ్చిందంటే చాలు అందరికీ గుర్తొచ్చేది మామిడి పండు. కేవలం రుచిలోనే కాదు, ఆరోగ్యాన్ని అందించడంలోనూ ఇది ముందుంటుందని పోషకాహార నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పండ్లలో రారాజుగా పిలుచుకునే మామిడిలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉండి మన శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. ఒక కప్పు (సుమారు 165 గ్రాములు) మామిడి పండు ముక్కల్లో దాదాపు 100 కేలరీల శక్తితో పాటు విటమిన్ ఎ, సి, పొటాషియం, ఫోలేట్ వంటి కీలక పోషకాలు లభిస్తాయి. ముఖ్యంగా, ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంలో, గాయాలు త్వరగా మానడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే విటమిన్ ఎ కంటిచూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మామిడిలో ఉండే ఫైబర్ (పీచుపదార్థం) జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది మలబద్ధకాన్ని నివారించడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నియంత్రిస్తుంది. మామిడిలోని సహజ ఎంజైమ్‌లు ఆహారం సులభంగా జీర్ణం కావడానికి దోహదం చేస్తాయి. ఇక గుండె ఆరోగ్యం విషయానికొస్తే, మామిడిలో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును అదుపులో ఉంచడంలో సహాయపడతాయి. మామిడిలో ఉండే మాంగిఫెరిన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి, దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గిస్తాయి. చర్మ సౌందర్యాన్ని కాపాడటంలోనూ మామిడి తన వంతు పాత్ర పోషిస్తుంది. అయితే, మామిడిలో సహజ చక్కెరలు ఉన్నందున మితంగా తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు వైద్యుల సలహా మేరకు దీనిని తీసుకోవడం ఉత్తమం.

# భారీ నష్టాల్లో సూచీలు.. 700 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్

- పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు
- భారీగా పతనమైన సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు
- 719 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఘర్షణతో ఆందోళన
- పెరుగుతున్న ముడి చమురు ధరలపై పెట్టుబడిదారుల భయాలు



పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. సోమవారం ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వెలువడిన ప్రతికూల సంకేతాలకు తోడు ముడిచమురు ధరలు పెరగడంతో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా, బీఎస్ఈ సెన్సెక్స్ 719.08 పాయింట్లు పతనమై 73,524.26 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 243.70 పాయింట్లు క్షీణించి 23,123 వద్ద స్థిరపడింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులకు దిగడం, దానికి ప్రతిగా ఇజ్రాయెల్ సైతం వైమానిక దాడులతో విరుచుకుపడటంతో పశ్చిమ ఆసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధరలు పెరగడం, భారత్ వంటి ముడిచమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశాలలో ద్రవ్యోల్బణం భయాలను పెంచుతోంది.

మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాల్లోనూ ప్రస్ఫుటంగా కనిపించింది. ప్రధానంగా రియల్టీ, మెటల్, ఆటో రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం 1.66 శాతం నుంచి 2.88 శాతం వరకు పతనమయ్యాయి.

మరోవైపు, ఇరాన్‌కు ప్రయాణాలను నిలిపివేయాలని, అక్కడ ఉన్న భారతీయులు తక్షణమే స్వదేశానికి తిరిగి రావాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న ఈ అనిశ్చితి కారణంగా మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# టెక్నాలజీ దిశగా అనిల్ అంబానీ కంపెనీ.. ఏఐ రంగంలోకి అడుగు




పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఆర్-ఇన్‌ఫ్రా) ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇతర నూతన టెక్నాలజీల రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు నేడు అధికారికంగా ప్రకటించింది. తన వ్యాపార కార్యకలాపాల్లో టెక్నాలజీ ఆధారిత సేవలను భాగం చేసే వ్యూహంలో భాగంగా ఈ అడుగు వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ మేరకు తమ అనుబంధ సంస్థల (సబ్సిడరీలు) ద్వారా ఈ కొత్త వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో రిలయన్స్ ఇన్‌ఫ్రా పేర్కొంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, సంబంధిత టెక్నాలజీ విభాగాల్లో పాలుపంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ఈ ప్రణాళికలో భాగంగా తమ మూడు సబ్సిడరీల పేర్లను కూడా మార్చింది. వాటికి రిలయన్స్ ఏఐ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ అపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ వన్ ప్రైవేట్ లిమిటెడ్ అని కొత్త పేర్లు పెట్టింది.

రిలయన్స్ ఇన్‌ఫ్రా ఏఐ రంగ ప్రవేశ ప్రకటన మార్కెట్లో తక్షణమే సానుకూల ప్రభావం చూపింది. ఈ వార్త వెలువడిన వెంటనే బీఎస్ఈలో కంపెనీ షేరు 5 శాతం పెరిగి రూ.86.17 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. అయితే, గత కొంతకాలంగా ఈ షేరు పనితీరు మిశ్రమంగా ఉంది. గత ఏడాది కాలంలో సుమారు 80 శాతం నష్టపోయినప్పటికీ, గత నెల రోజుల్లో 20 శాతానికి పైగా లాభపడటం గమనార్హం. గత ఆరు నెలల్లో 40 శాతం పతనం కాగా, గత ఐదేళ్లలో మాత్రం 3 శాతానికి పైగా లాభాలను అందించింది. ఇక కంపెనీ ఆర్థిక ఫలితాలను పరిశీలిస్తే, 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ. 918 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కార్యకలాపాల ద్వారా రూ. 4,001 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపింది. అలాగే, 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 2,900 కోట్ల లాభాన్ని, రూ. 20,440 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. అయితే, ఏఐ రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, ఈ ప్రాజెక్టులకు ఎంత పెట్టుబడి పెట్టనున్నారు, నిర్దిష్ట వ్యాపార ప్రణాళికలు ఏమిటి, ఎప్పటిలోగా కార్యకలాపాలు ప్రారంభిస్తారు? వంటి కీలక వివరాలను కంపెనీ ప్రస్తుతానికి వెల్లడించలేదు. ఈ అంశాలపై భవిష్యత్తులో స్పష్టత వచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## వేల కోట్ల AI ప్రాజెక్ట్ దక్కించుకున్న TCS.. పండగ చేసుకుంటున్న టెక్కీలు




దేశీయ ఐటీ దిగ్గజం TCS యూరప్ మార్కెట్‌లో మరో భారీ జాక్‌పాట్ కొట్టింది. గ్లోబల్ లైఫ్ అండ్ పెన్షన్స్ ఇన్సూరెన్స్ రంగంలో ప్రముఖ సంస్థ అయిన 'కెనడా లైఫ్' నుంచి వేల కోట్లు విలువైన మెగా డీల్‌ను టీసీఎస్ దక్కించుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానంతో కెనడా లైఫ్ సంస్థకు చెందిన ఐటీ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి ఈ మల్టీ-ఇయర్ కాంట్రాక్ట్ కుదిరింది. ఐటీ రంగంలో రిక్రూట్మెంట్స్ మందగించిన సమయంలో కూడా టీసీఎస్ ఇలాంటి ప్రతిష్టాత్మకమైన మెగా డీల్‌ను సొంతం చేసుకోవడం ఉద్యోగులను సంతోషంలో ముంచేస్తోంది.

ఈ వ్యూహాత్మక ఒప్పందం ప్రకారం.. బ్రిటన్, ఐర్లాండ్, జర్మనీ సహా యూరప్ అంతటా ఉన్న కెనడా లైఫ్ వ్యాపార కార్యకలాపాలకు టీసీఎస్ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరించనుంది. ఇందులో భాగంగా డేటా సెంటర్లు, కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎండ్-యూజర్ కంప్యూటింగ్, సాఫ్ట్‌వేర్ లైఫ్‌సైకిల్ మేనేజ్‌మెంట్‌ను టీసీఎస్ ఆధునీకరించటంతో పాటు నిర్వహించనుంది. తన సరికొత్త ఏఐ, డిజిటల్ సామర్థ్యాలను ఉపయోగించడం ద్వారా క్లిష్టమైన ఐటీ ప్రక్రియలను ఆటోమేషన్ చేయడం, సిస్టమ్స్ భద్రతను పెంచడం, వినియోగదారులకు అత్యుత్తమ డిజిటల్ అనుభవాన్ని అందించడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశంగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపార సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవడానికి ఏఐ ఆధారిత సాంకేతికత వైపు మొగ్గు చూపుతున్నాయి. తమ వ్యాపార పునాదులను ఆధునీకరించే ప్రయాణంలో టీసీఎస్‌తో చేతులు కలపడం తదుపరి దశ అని కెనడా లైఫ్ యూరప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫీసర్ కారోలిన్ దిబ్స్ అభిప్రాయపడ్డారు. తమ భవిష్యత్తు ప్రణాళికలను అర్థం చేసుకునే భాగస్వామి ముఖ్యమని, టీసీఎస్ వద్ద ఉన్న సాంకేతిక నైపుణ్యం తమ వ్యూహాలకు ఎంతో బాగా సరిపోతుందని ఆయన అన్నారు. ఈ మెగా ప్రాజెక్ట్ సాధించడం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ-ఆధారిత టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీగా ఎదగాలనే తన లక్ష్యానికి టీసీఎస్ మరో అడుగు దగ్గరైంది. టీసీఎస్ యూకే అండ్ ఐర్లాండ్ హెడ్ వినయ్ సింఘ్వీ స్పందిస్తూ.. "కెనడా లైఫ్ టెక్నాలజీ ఆధునీకరణ ప్రయాణంలో వ్యూహాత్మక భాగస్వామిగా ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఏఐ ఆధారిత పరివర్తనలో మా నాయకత్వానికి ఈ ఒప్పందమే నిదర్శనం" అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా టీసీఎస్ బ్రిటన్, ఐర్లాండ్, జర్మనీ దేశాల్లో తమ ఐటీ ఉద్యోగులకు అడ్వాన్స్ ఏఐ టూల్స్ వాడటంలో శిక్షణ, సర్టిఫికేషన్, కెరీర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను కూడా నిర్వహించనుంది. మొత్తానికి యూరప్ ఇన్సూరెన్స్ రంగంలో టీసీఎస్ కొట్టిన ఈ ప్రాజెక్టుతో గ్లోబల్ మార్కెట్‌లో దాని పేరు మారుమోగిపోనుందని నిపుణులు అంటున్నారు.

## నెలకు రూ.40వేలు సంపాదనతో కోటి కూడబెట్టాలని ఉందా..? ఇదిగో పక్కా సేవింగ్స్ ప్లాన్




మారిన కాలంలో నిత్యావసర వస్తువుల ధరల నుంచి పిల్లల స్కూల్ ఫీజుల వరకు అన్నీ కొండెక్కి కూర్చుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నెలకు రూ.30వేల నుంచి రూ.50వేల లోపు జీతం సంపాదించేవారు మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ డబ్బు సేవ్ చేయడం చాలా కష్టంగా మారుతోంది. అయితే చేతిలో తక్కువ జీతం ఉన్నప్పటికీ.. భవిష్యత్తు కోసం కోటి రూపాయలు కూడబెట్టాలనే కల ప్రతి ఒక్కరికీ ఉంటుంది. నెలకు రూ.40వేలు జీతం వచ్చే సగటు ఉద్యోగి కూడా క్రమశిక్షణతో ఇన్వెస్ట్ చేస్తే రూ.కోటి టార్గెట్‌ను ఎలా చేరుకోవచ్చో ఆర్థిక నిపుణులు వివరిస్తున్నారు. దీనికి 'స్టెప్-అప్ ఎస్ఐపీ' అనే అద్భుతమైన ఫైనాన్షియల్ అస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అంటున్నారు.

సాధారణంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(రాఖా) అంటే ప్రతి నెలా ఒక స్థిరమైన మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం. కానీ 'స్టెప్-అప్ ఎస్ఐపీ' అనేది దీనికి కొంచెం డిఫరెంట్ ఉంటది. ఇందులో ప్రతి సంవత్సరం మీ పెట్టుబడి మొత్తాన్ని కొంత శాతం మేర పెంచుకుంటూ వెళ్తాలి. ఉద్యోగులకు ఏటా వచ్చే అదనపు ఆదాయాన్ని ఈ స్టెప్-అప్ పెట్టుబడికి ఉపయోగించవచ్చు. ఇలా క్రమంగా పెట్టుబడిని పెంచడం వల్ల 'పవర్ ఆఫ్ కాంపౌండింగ్' మరింత వేగంగా పనిచేసి.. తక్కువ కాలంలోనే ఊహించని స్థాయిలో భారీ లాభాలను తెచ్చిపెడుతుంది. ప్రారంభంలోనే ఎక్కువ మొత్తం ఇన్వెస్ట్ చేయాలనే ఒత్తిడి లేకుండా.. పెరుగుతున్న ఆదాయానికి అనుగుణంగా ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇది చక్కటి మార్గం.

రూ.కోటి కార్పస్‌ను సాధించడానికి నిపుణులు ఒక క్యాలిక్యులేషన్ సూచిస్తున్నారు. నెలకు రూ.40వేలు సంపాదించే వ్యక్తి ప్రతి నెలా రూ.8వేలతో సిప్ ప్రారంభించాడనుకుందాం. ఆ తర్వాత ప్రతి సంవత్సరం ఆ పెట్టుబడిని జస్ట్ 10 శాతం మేర పెంచుకుంటూ వెళ్లాలి. అంటే మొదటి ఏడాది నెలకు రూ.8,000 చొప్పున కడితే, రెండో ఏడాది నెలకు రూ.8,800 చొప్పున కట్టాలనమాట. ఈ విధంగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఏటా సగటున 12 శాతం వార్షిక రిటర్న్స్ వస్తాయని అంచనా వేసినా.. సదరు ఇన్వెస్టర్ కేవలం 18 ఏళ్లలోనే సుమారు రూ.కోటిని సులువుగా కూడబెట్టవచ్చు. మీ వయస్సు, ఆర్థిక లక్ష్యాలను బట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్ కాలపరిమితిని 15, 20, 25 లేదా 30 ఏళ్ల వరకు కూడా పొడిగించుకోవచ్చు. మన దేశంలో సాంప్రదాయ పెట్టుబడి మార్గాలైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు వంటి ఎన్నో ఆప్షన్లు ఉన్నప్పటికీ.. దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని తట్టుకుని నిలబడే రిటర్న్స్‌ను ఇవి అందించలేవు. మరోవైపు మ్యూచువల్ ఫండ్స్‌లో మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల ఏటా వచ్చే రిటర్న్స్ ఒకేలా ఉండకపోవచ్చు. కొన్ని సంవత్సరాలు తక్కువగా, మరికొన్ని సంవత్సరాలు చాలా ఎక్కువగా ఉండవచ్చు. అయినప్పటికీ గత చరిత్రను పరిశీలిస్తే దీర్ఘకాలంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ సగటున 10% నుండి 13% వరకు లాభాలను అందించాయి. అందుకే తక్కువ జీతంతోనే రిటైర్మెంట్ నాటికి కోటీశ్వరులు కావాలనుకునే వారికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో స్టెప్-అప్ సిప్ ప్లాన్ మంచి ఆప్షన్ అంటున్నారు ఆర్థిక నిపుణులు.

# రాత్రి పూట ఆకలవుతుందని స్నాక్స్ తినకండి.. వీటిని తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది..



అర్ధరాత్రి ఆకలి వేయగానే చాలామంది వెంటనే ఇన్‌స్టంట్ నూడుల్స్ వైపు మొగ్గు చూపుతారు. కేవలం కొన్ని నిమిషాల్లో తయారయ్యే ఈ ఆహారం తాత్కాలికంగా ఆకలిని తీర్చినా, ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలు చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో తరచూ ఇన్‌స్టంట్ నూడుల్స్ తినడం గుండె ఆరోగ్యం, రక్తపోటు, నిద్ర, జీవక్రియలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని చెబుతున్నారు. ఇన్‌స్టంట్ నూడుల్స్‌లో ప్రధానంగా అధిక మొత్తంలో సోడియం (ఉప్పు) ఉంటుంది. ఒక ప్యాకెట్ నూడుల్స్‌లో సుమారు 800 నుంచి 1,200 మిల్లీగ్రాముల వరకు సోడియం ఉండే అవకాశం ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔను) సూచనల ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 2వేల మిల్లీగ్రాముల కంటే తక్కువ సోడియం మాత్రమే తీసుకోవాలి. అంటే ఒక్క బౌల్ నూడుల్స్‌తోనే రోజువారీ పరిమితికి సగానికి పైగా చేరుకునే అవకాశం ఉంటుంది. సోడియం అధికంగా తీసుకున్నప్పుడు శరీరంలో నీరు నిల్వ ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి గుండె మరింత కష్టపడాల్సి వస్తుంది. ఫలితంగా రక్తపోటు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే అధిక రక్తపోటు లేదా గుండె జబ్బుల కుటుంబ చరిత్ర ఉన్నవారిలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. నిపుణుల ప్రకారం సమస్య కేవలం నూడుల్స్ తినడంలోనే కాదు, వాటిని రాత్రి ఆలస్యంగా తినడంలో కూడా ఉంటుంది. సాధారణంగా రాత్రి సమయంలో శరీరంలోని రక్తపోటు సహజంగా కొంత తగ్గుతుంది. దీనివల్ల గుండె, రక్తనాళాలకు విశ్రాంతి లభిస్తుంది. అయితే అధిక సోడియం కలిగిన ఆహారాన్ని రాత్రి వేళల్లో తీసుకుంటే ఈ సహజ ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. అదే సమయంలో మూత్రపిండాలు (కిడ్నీలు) రాత్రి వేళల్లో కొంత నెమ్మదిగా పనిచేస్తాయి. ఫలితంగా శరీరంలోకి చేరిన అదనపు సోడియాన్ని బయటకు పంపేందుకు ఎక్కువ సమయం పడుతుంది. దీంతో రక్తపోటుపై ప్రభావం ఎక్కువసేపు కొనసాగుతుంది. రాత్రి సమయంలో ఇన్సులిన్ సున్నితత్వం కూడా తక్కువగా ఉంటుంది. అలాంటి సమయంలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే నూడుల్స్ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. ఇది జీవక్రియల సమతుల్యతను దెబ్బతీస్తుంది. నిద్రపై కూడా ఈ అలవాటు ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. రాత్రి ఆలస్యంగా భారీ ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి అసౌకర్యంగా అనిపించడమే కాకుండా నిద్రకు అవసరమైన హార్మోన్ల పనితీరుపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దీంతో నిద్ర నాణ్యత తగ్గుతుంది. రాత్రిపూట తరచూ అధిక సోడియం ఉన్న ఆహారాలు తీసుకునే వారిలో ఉదయం లేవగానే తలనొప్పి, అలసట, రక్తపోటు స్వల్పంగా పెరగడం వంటి సమస్యలు కనిపించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కనుక అర్ధరాత్రి ఆకలి వేస్తే ఇన్‌స్టంట్ నూడుల్స్‌కు బదులుగా ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం మంచిది. చిన్న గిన్నె పప్పు, వేయించిన మఖానా (ఫాక్స్ నట్స్), అరటిపండు, ఉప్పు లేని డ్రైఫ్రూట్స్, పసుపు కలిపిన గోరువెచ్చని పాలు లేదా కమోమిల్ టీ, కొద్దిగా పీనట్ బటర్ రాసిన గోధుమ రొట్టె వంటి ఆహారాలు ఆరోగ్యకరమైన ఎంపికలుగా ఉంటాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం నూడుల్స్‌ను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే వాటిని ప్రతిరోజూ ముఖ్యంగా రాత్రి 10 గంటల తర్వాత తినే అలవాటుగా మార్చుకోవద్దు. ఒకవేళ తినాల్సి వచ్చినా పరిమిత మోతాదులో, తక్కువ ఉప్పు కలిగిన ఎంపికలను ఎంచుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## ఫ్రిజ్‌లో చీజ్ ను నిల్వ ఉంచుతున్నారా.. అయితే ఈ ముఖ్యమైన విషయాలను తెలుసుకోవాల్సిందే..



పాలతో తయారు చేసే పదార్థాల్లో చీజ్ ఒకటి. చీజ్ తో రకరకాల పదార్థాలను తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. చీజ్ తో చేసే పదార్థాలు చాలా రుచిగా ఉంటాయి. అయితే ఫ్రిజ్‌లో చీజ్‌ను నిల్వ చేయడం చాలా మందికి ఉన్న అలవాటు. దాన్ని ఎలా నిల్వ చేస్తున్నామన్న విషయం చీజ్ నాణ్యత, తాజాదనం, ఆరోగ్య భద్రతపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చీజ్‌ను ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేయడం సౌకర్యవంతంగా అనిపించినప్పటికీ, అది సరైన పద్ధతి కాదని హెచ్చరిస్తున్నారు. చీజ్‌ను ప్లాస్టిక్ బ్యాగ్‌లో ఉంచినప్పుడు లోపల తేమ ఉండే అవకాశం ఉంటుంది. ఈ తేమ కారణంగా అవాంఛిత ఫంగస్ (మోల్డ్) వేగంగా పెరిగే పరిస్థితులు ఏర్పడతాయి. అంతేకాకుండా కొన్ని రకాల బ్యాక్టీరియా కూడా ఇలాంటి తడి వాతావరణంలో సులభంగా పెరిగే ప్రమాదం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. మరో ముఖ్యమైన అంశం ప్లాస్టిక్‌లో ఉండే రసాయనాలు. చీజ్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉండటం వల్ల ప్లాస్టిక్‌లోని కొన్ని పదార్థాలు ఆహారంలోకి చేరే అవకాశం ఉంటుందని ఆహార భద్రత నిపుణులు చెబుతున్నారు. దీంతో దీర్ఘకాలికంగా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉంటుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**ఇలా చేయాలి..**

చీజ్‌ను సురక్షితంగా నిల్వ చేయాలంటే కాగితం ఆధారిత ర్యాపింగ్‌ను ఉపయోగించడం మంచిది. పార్చ్‌మెంట్ పేపర్ లేదా వెక్స్ పేపర్‌లో చీజ్‌ను చుట్టి, ఆ తర్వాత మూత ఉన్న డబ్బాలో ఉంచితే మరింత మెరుగైన ఫలితం ఉంటుంది. ఈ విధానం వల్ల చీజ్‌కు అవసరమైనంత గాలి ప్రసరణ లభించడంతోపాటు అదనపు తేమ పేరుకుపోకుండా ఉంటుంది. కాగితం చీజ్‌ను శ్వాసించడానికి అవకాశం కల్పిస్తుంది. దీంతో దాని సహజ రుచి, ఆకృతి, తాజాదనం ఎక్కువ కాలం పాటు నిల్వ ఉంటాయి. అదే సమయంలో ఫంగస్ పెరుగుదల ప్రమాదం కూడా తగ్గుతుంది. అందువల్ల ఫ్రిజ్‌లో చీజ్‌ను నిల్వ చేసే సమయంలో ప్లాస్టిక్ సంచులను ఉపయోగించే బదులుగా పార్చ్‌మెంట్ లేదా వెక్స్ పేపర్‌ను ఎంచుకోవడం ఉత్తమం. ఈ చిన్న మార్పు చీజ్‌ను ఎక్కువకాలం తాజాగా ఉంచడమే కాకుండా ఆహార భద్రతను కూడా మెరుగుపరుస్తుంది.

## రోజూ కంప్యూటర్లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారా.. ఈ సులభమైన వ్యాయామాలు చేయండి..



నేటి ఉద్యోగ జీవితంలో ఎక్కువ సమయం కంప్యూటర్ ముందు కూర్చొని పనిచేయడం సాధారణంగా మారిపోయింది. అయితే గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల మెడ నొప్పి, భుజాల బిగుతు, వెన్నునొప్పి, నడుము సమస్యలు వంటి అనేక శారీరక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లను నిరంతరం ఉపయోగించే వారిలో ఈ సమస్యలు మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రోజువారీ జీవితంలో కొన్ని సులభమైన వ్యాయామాలను చేర్చుకోవడం ద్వారా ఈ అసౌకర్యాలను తగ్గించుకోవచ్చని ఫిట్‌నెస్ నిపుణులు సూచిస్తున్నారు.

**థొరాసిక్ రొటేషన్ స్ట్రెచ్..**

కంప్యూటర్ లేదా మొబైల్ స్క్రీన్ వైపు ఎక్కువసేపు తల వంచి చూడటం వల్ల మెడ, భుజాలపై అదనపు ఒత్తిడి పడుతుంది. దీని ఫలితంగా కండరాలు బిగుసుకుపోయి నొప్పి, అసౌకర్యం ఏర్పడుతుంది. ఈ ప్రభావాలను తగ్గించేందుకు శరీర కదలికలను పెంచే కొన్ని స్ట్రెచింగ్ వ్యాయామాలు ఉపయోగపడతాయి. అలాంటి వ్యాయామాల్లో మొదటిది థొరాసిక్ రొటేషన్ స్ట్రెచ్. ఈ వ్యాయామం కోసం నాలుగు కాళ్లపై నిలబడి ఒక చేతిని నేలపై ఉంచి, మరో చేతిని శరీరానికి ఆనించి ఉంచాలి. ఆ తర్వాత నెమ్మదిగా ఛాతిని పైవైపు తిప్పుతూ చేతిని పైకి ఎత్తి, తిరిగి మొదటి స్థితికి రావాలి. ఈ కదలిక వెన్నెముక మధ్య భాగం కదలికలను మెరుగుపరచడంలో సహాయపడటమే కాకుండా ఛాతి భాగాన్ని తెరచి బిగుతును తగ్గిస్తుంది.

**థ్రెడ్ ది నీడిల్ స్ట్రెచ్..**

థ్రెడ్ ది నీడిల్ స్ట్రెచ్ కూడా కార్యాలయ ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరమైన వ్యాయామంగా ఉంటుంది. టేబుల్‌టాప్ స్థితిలో ఉండి ఒక చేతిని ఎదురుగా ఉన్న చేతి కిందుగా నేలపైకి జార్చాలి. ఆ తర్వాత అదే చేతిని పైవైపు ఎత్తుతూ ఛాతిని తెరవాలి. ఈ వ్యాయామం మెడ, భుజాలు, పైభాగం వెన్నులో పేరుకుపోయిన ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. మరో ప్రభావవంతమైన వ్యాయామం ఓపెన్ బుక్ స్ట్రెచ్. పక్కకు పడుకుని పై కాలి మోకాలి కింద దిండు లేదా కుషన్ ఉంచాలి. శరీర కింది భాగాన్ని కదపకుండా పై భాగాన్ని నెమ్మదిగా వెనక్కి తిప్పుతూ పై చేతిని ఎదురువైపు చాపాలి. పుస్తకం తెరిచినట్లుగా కనిపించే ఈ కదలిక ఛాతి కండరాలను సాగదీసి మెడ, భుజాలు, పై వెన్ను భాగంలోని బిగుతును తగ్గించడంలో సహాయపడుతుంది.

**వై-టి-డబ్ల్యూ-ఐ ఎక్స్‌టెన్షన్స్..**

వై-టీ-డబ్ల్యూ-ఐ ఎక్స్‌టెన్షన్స్ అనే వ్యాయామం భంగిమను మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పొట్టపై పడుకుని చేతులను ముందుగా ఆకారంలో చాపి, తర్వాత ౨, ఔ ఆకారాల్లో కదిలిస్తూ మళ్లీ మొదటి స్థితికి తీసుకురావాలి. ఈ వ్యాయామం పై వెన్ను, భుజాలు, భంగిమను నిలబెట్టే కండరాలను బలపరుస్తుంది. ముఖ్యంగా కంప్యూటర్ ముందు ఎక్కువసేపు కూర్చునే వారిలో వంగిన భుజాలను సరిచేయడంలో ఇది సహాయపడుతుంది. ఈ వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం వల్ల కండరాల బిగుతు తగ్గి శరీర కదలికలు మెరుగుపడతాయి. అలాగే ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో సహాయపడతాయి. పని మధ్యలో చిన్న విరామాలు తీసుకుంటూ ఈ తరహా స్ట్రెచింగ్ వ్యాయామాలను అలవాటు చేసుకోవడం ద్వారా మెడ, భుజాలు, వెన్నెముక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు గల్లంతు.. ముంబై ఇండియన్స్‌ను వీడబోతున్న సూర్య భాయ్




**హైదరాబాద్ పెన్ పవర్:** సూర్యకుమార్ యాదవ్: గత కొంతకాలంగా సూర్యకుమార్ యాదవ్ కు పెద్దగా ఏడీ కూడా కలిసి రావట్లేదు.. ఈ ఏడాది తన సారథ్యంలో టీమిండియాకు టీ20 ప్రపంచకప్ 2026 అందించినప్పటి నుంచి అతడికి కష్టకాలం మొదలైంది. అంతకు కొన్ని నెలల నుంచి ఫామ్ లేక ఇబ్బంది పడుతున్న సూర్య.. తీవ్ర విమర్శలని ఎదుర్కొన్నాడు. ఐపీఎల్ లోనూ తీవ్రంగా నిరాశపర్చడంతో.. తాజాగా భారత జట్టు టీ20 కెప్టెన్సీతో పాటు తుది జట్టులో స్థానాన్ని కోల్పోయాడు. ఇక ఇప్పుడు అతడు మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది.

వచ్చే ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ జట్టుని వీడనున్నట్లు జోరుగా ప్రచారం కొనసాగుతుంది. చాలా ఏళ్లుగా ముంబైలో కీలక ఆటగాడిగా ఉన్న సూర్య భాయ్.. ఆ జట్టుకు గుడ్ బై చెప్పనున్నట్లు టాక్ నడుస్తుంది. దీంతో సూర్యకుమార్ యాదవ్ ఇన్ స్టాలో ముంబైని అన్ ఫాలో చేసిన విషయం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. అంతేకాదు, అతడు ముంబైకి సంబంధించిన 100కు పైగా పోస్టులను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం అతడి ఇన్ స్టాలో ఒక్క ఫోటో కూడా ముంబైకి సంబంధించినది లేదని ఫ్యాన్స్ పేర్కొంటున్నారు. అది కూడా రోహిత్ శర్మ , మహేంద్ర సింగ్ ధోనీ )తో కలిసి దిగిన ఫోటోలు ఉండటం గమనార్హం.

సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ జట్టుని వీడాలని ఫిక్స్ అయినట్లు తెలుస్తుంది. ఇప్పటికే హార్దిక్ పాండ్యా కూడా.. ముంబైని వదిలి పెట్టాలని నిర్ణయించుకున్నాడని జోరుగా ప్రచారంద

నడుస్తుంది. కాగా ప్రస్తుతం సూర్య.. ఇన్ స్టాలో హార్దిక్ పాండ్యాను కూడా ఫాలో కాకపోవడం గమనార్హం. కాగా గత కొన్ని సీజన్లుగా దారుణ ప్రదర్శన చేస్తున్న ముంబై ఇండియన్స్ కూడా జట్టును ప్రక్షాళన చేయాలని చూస్తోంది. అందుకే కొత్త ప్లేయర్స్ తో జట్టును పునర్మించుకోవాలని డిసైడ్ అయినట్లు టాక్. దీనిపై కొన్ని రోజుల తర్వాత క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది.

## భారత్ చారిత్రాత్మక విజయం.. 93 ఏళ్లలో ఇదే ఫస్ట్ టైమ్!






**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూ చండీగఢ్ లోని ముల్లన్‌పూర్ వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో భారీ విజయం సాధించిన టీమిండియా ఒక అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. 1932 నుంచి అంతర్జాతీయ టెస్టులు ఆడుతున్న భారత జట్టుకు.. గత 93 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలోనే ఇదే అత్యంత అతి పెద్ద విజయం కావడం విశేషం. ఆఫ్ఘనిస్థాన్‌ను ఫాలోఆన్ ఆడించి మరీ ఇన్నింగ్స్, 300 పరుగుల తేడాతో ఓడించి టీమిండియా ఈ నయా రికార్డును సెట్ చేసింది.

93 ఏళ్ల కిందట మొదలైన భారత టెస్ట్ ప్రయాణంలో.. న్యూ చండీగర్ లోని ముల్లన్‌పూర్‌లో సాధించిన ఈ విజయం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. దీంతో టీమిండియా ఆటగాళ్ల డామినేషన్‌కు క్రికెట్ ఫ్యాన్స్ అంతా సోషల్ మీడియాలో ఫుల్ ఖుషీ అవుతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్నీ విజయాలని భారత జట్టు అందుకోవాలని పేర్కొంటున్నారు.

**టెస్ట్ క్రికెట్ హిస్టరీలో భారత్ టాప్- 5 విజయాలు ఇవే:**

2026లో ఇన్నింగ్స్ & 300 రన్స్ –తేడాతో ఆఫ్ఘనిస్థాన్ పై భారత్ విజయం (ఆల్–టైమ్ నంబర్ 1 బిగ్గెస్ట్ విక్టరీ).

2018లో ఇన్నింగ్స్ & 272 రన్స్ –తేడాతో– వెస్టిండీస్ పై గెలిచిన భారత్

2018లో ఇన్నింగ్స్ & 262 రన్స్ తేడాతో– ఆఫ్ఘనిస్థాన్ పై విజయం సాధించిన టీమిండియా

– 2007లో ఇన్నింగ్స్ &239 రన్స్ తేడాతో– బంగ్లాదేశ్ పై భారత్ గెలుపు

2017లో ఇన్నింగ్స్ & 239 రన్స్ తేడాతో శ్రీలంకపై టీమిండియా విక్టరీ

## ఈ-గేట్స్ యాడ్ ప్రచారంలో కోహ్లీ.. లండన్‌లో ఉంటూ ఇండియాలో సలహాలా అంటూ ట్రోలింగ్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లీ ( మళ్లీ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాడు. కాకపోతే ఈసారి గ్రౌండ్ లో కొట్టిన పరుగుల వల్ల కాదు.. ఆయన చేసిన ఒక ప్రమోషనల్ యాడ్ వల్ల నెటిజన్లు ఓ ఆట ఆడేసుకుంటున్నారు. ఎయిర్‌పోర్టుల్లో ఇమ్మిగ్రేషన్ ప్రాసెస్ ఈజీగా అవ్వడం కోసం కేంద్ర హోంశాఖ తీసుకొచ్చిన 'ఈ–గేట్స్' (e-gates) ను పొగుడుతూ కోహ్లీ ఒక వీడియో చేశాడు. దీన్ని బీజేపీ తన అఫీషియల్ సోషల్ మీడియా హ్యాండిల్‌లో పోస్ట్ చేయడంతో నెటిజన్లు కోహ్లీపై మీమ్స్‌తో చెలరేగిపోతున్నారు.

**నేను కూడా రెగ్యులర్ ప్లేయర్నే:**

ఈ ప్రమోషనల్ వీడియోలో కోహ్లీ మాట్లాడుతూ.. ఇండియన్ హోమ్ మినిస్ట్రీ తీసుకొచ్చిన ఈ–గేట్స్ వల్ల ఇమ్మిగ్రేషన్ ప్రాసెస్ స్మూత్‌గా మారింది. నేను కూడా ఎప్పుడూ ఇంటర్నేషనల్ ప్రయాణాలు చేస్తుంటాను.. ఈ ఈ–గేట్స్ రావడం వల్ల కౌంటర్ల దగ్గర గంటల తరబడి నిలబడే లొల్లి పూర్తిగా తప్పిపోయింది. ప్రాసెస్ చాలా స్పీడ్‌గా, ఎఫిషియంట్‌గా జరుగుతోంది.. నాలాంటి ట్రావెలర్స్ కోసం ఇంత మంచి సిస్టమ్ తెచ్చినందుకు మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్‌కు థాంక్స్ అని విరాట్ చెప్పాడు.

**లండన్ కనెక్షన్ పై నెటిజన్ల సెటైర్స్:**

ఈ వీడియో బయటకు రాగానే సోషల్ మీడియాలో నెటిజన్లు గట్టిగానే ట్రోలింగ్ చేస్తున్నారు. ఎందుకంటే విరాట్ కోహ్లీ తన ఫ్యామిలీతో కలిసి లండన్‌లోనే సెటిల్ అయ్యాడనే టాక్ ఉంది. క్రికెట్ మ్యాచులు ఉన్నప్పుడు భారత్ కి రావడం.. మ్యాచులు ఆయిపోగానే ఫ్లైట్ ఎక్కి లండన్ వెళ్లడం ఆయనకి అలవాటుగా మారింది. కరెక్ట్ మొనగాడినే పట్టుకున్నారంటూ జనాలు జోకులు వేసుకుంటున్నారు. ఎందుకంటే కోహ్లీ కంటే ఎక్కువగా ఎయిర్‌పోర్ట్ ఇమ్మిగ్రేషన్ రూల్స్ ఎవరికి తెలుస్తాయి.. లండన్ ట్రిప్పులు వేసే కోహ్లీకి ఈ యాడ్ పక్కా సెట్ అయిందంటూ విపరీతంగా మీమ్స్ ట్రెండ్ చేస్తున్నారు.

**గాయం వల్ల ఆఫ్ఘన్ సిరీస్‌కు దూరం:**

ఇక క్రికెట్ విషయానికి వస్తే.. మొన్నటి ఐపీఎల్ 2026 ఫైనల్‌లో అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ను గెలిపించడానికి కోహ్లీ కష్టపడ్డాడు. ఆ మ్యాచ్‌లో 75 రన్స్ నాటౌట్‌తో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడినప్పటికీ.. రన్నింగ్ చేసేటప్పుడు కుడి తొడ కండరాల గాయం ఎక్కువైంది. ఆ ఇంజ్యూరీ తగ్గకపోవడంతోనే ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే వన్డే సిరీస్‌కు కోహ్లీ దూరమయ్యాడు. బీసీసీఐ కోహ్లీ ప్లేస్‌లో యంగ్ ప్లేయర్ యశస్వి జైస్వాల్‌ను రీప్లేస్‌మెంట్‌గా ప్రకటించింది.

## సమంత, సాయి పల్లవి కలిస్తే.. ఒక్క రిప్లై తోనే ఫుల్ హైప్!

స్టార్ హీరోయిన్లు సమంత, సాయి పల్లవి కలిసి ఒక సినిమాలో నటిస్తే ఎలా ఉంటుంది? ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇదే విషయం హాట్ టాపిక్ గా మారింది. దీనికి కారణం మా ఇంటి బంగారం సినిమా ప్రమోషన్స్ సందర్భంగా జరిగిన ఓ ఇంట్రెస్టింగ్ ఇన్సిడెంట్. సామ్ లీడ్ రోల్ లో నటించి నిర్మించిన మా ఇంటి బంగారం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మూవీ టీమ్ ప్రమోషన్స్ ను ఇప్పటికే స్టార్ట్ చేసింది.అయితే ప్రమోషన్స్ లో భాగంగా సమంత రీసెంట్ గా ఓ వీడియోను షేర్ చేశారు. అందులో సినిమా కథ గురించి మాట్లాడుతూ.. అసలు మా ఇంటి బంగారం స్టోరీ మొదట సాయి పల్లవిని దృష్టిలో పెట్టుకుని రాశారని చెప్పారు. దర్శకురాలు నందినీ రెడ్డి కూడా ముందుగా సాయి పల్లవితో ఆ ప్రాజెక్ట్ చేయాలని భావించారట. కానీ ఆ సమయంలో సాయి పల్లవి వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో రిజెక్ట్ చేశారని సమంత తెలిపారు.ఆ తర్వాత కథలో కొన్ని మార్పులు చేసి తనకు తగ్గట్టు రూపొందించారని చెప్పారు. "ఈ సినిమాను నేను సెలెక్ట్ చేసుకోలేదు.. సినిమానే నన్ను ఎంపిక చేసుకుంది' అంటూ సామ్ చేసిన కామెంట్స్ ఫ్యాన్స్ ను ఆకట్టుకున్నాయి. అదే వీడియోను చూసిన సాయి పల్లవి వెంటనే రెస్పాండ్ అయ్యారు. సమంత ఇన్ స్టా స్టోరీని షేర్ చేస్తూ.. 'ఈ సినిమా సమంత చేయాల్సినదే. ఆమెకే బాగా సరిపోతుంది. సమంతకు, నందినీ రెడ్డికి నా విషెస్" అంటూ రాసుకొచ్చారు.అయితే ఆమె పోస్ట్ చివర్లో 'అవును.. త్వరలో' అంటూ ఇచ్చిన చిన్న మెసేజ్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ ఒక్క మాటతో కొత్త చర్చ మొదలైంది. సమంత, సాయి పల్లవి కలిసి ఏదైనా కొత్త సినిమా చేయబోతున్నారా? లేక మరో ప్రాజెక్ట్ గురించి ఇద్దరూ ఇప్పటికే మాట్లాడుకున్నారా? అనే ప్రశ్నలు అభిమానుల్లో మొదలయ్యాయి. దీనిపై ఇద్దరూ ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోయినా సోషల్ మీడియాలో ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి.నిజానికి సమంత, సాయి పల్లవి ఇద్దరూ యాక్టింగ్ కు స్కోప్ ఉన్న పాత్రలను ఎంచుకుంటారు. కమర్షియల్ సినిమాలతో పాటు కథకు ఇంపార్టెన్స్ ఉన్న చిత్రాల్లో కూడా తమదైన ముద్ర వేశారు. అందుకే వీరిద్దరూ కలిసి నటిస్తే బ్లాక్ బస్టర్ హిట్ మూవీ పక్కా అంటున్నారు సినీ ప్రియులు. మరోవైపు సమంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ కూడా ఉమెన్ ఓరియెంటెడ్ స్టోరీలపై ఎక్కువ ఫోకస్ పెడుతోంది.దీంతో ఫ్యూచర్ లో సాయి పల్లవితో కలిసి ఏదైనా సినిమా చేసే అవకాశం ఉందా అనే చర్చ కూడా సాగుతోంది. ప్రస్తుతం అయితే దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ ఏదీ లేదు. కానీ సాయి పల్లవి చేసిన చిన్న కామెంట్ మాత్రం పెద్ద చర్చకు కారణమైంది. ఫుల్ హైప్ కూడా క్రియేట్ చేసింది. ఒకవేళ ఫ్యూచర్లో సమంత, సాయి పల్లవి కలిసి స్క్రీన్ పై కనిపిస్తే.. అది స్పెషల్ కాంబినేషన్ అవుతుందనడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు.







సప్తమి గౌడ సాంప్రదాయ లుక్‌లో అద్భుతంగా, దేశవ్యాప్తంగా హృదయాలను గెలుచుకుంది



శ్రద్ధా దాస్ చీర అందం సోషల్ మీడియా అభిమానులను కట్టిపడేసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965